# ఈనాడు అనకాపల్లి

బుధవారం 2 అక్టోబరు 2024






దేముడమ్మకు పింఛను నగదు అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

## తొలిరోజే 97 శాతం పింఛన్ల పంపిణీ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మంగళవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైంది. సబ్బవరం మండలం అమృతపురం గ్రామానికి ఉదయం ఆరు గంటలకు కలెక్టర్ విజయకృష్ణన్ చేరుకుని వృద్ధులు దేముడమ్మ, గంది సన్నమ్మ, దివ్యాంగురాలు సింగంపల్లి పెంటమ్మ తదితర లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను అందించారు. కలెక్టరే స్వయంగా పింఛను ఇవ్వడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఎప్పటి నుంచి పింఛన్లు తీసుకుంటున్నారు? ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు ఇస్తున్నారా? తదితర వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొలిరోజే వందశాతం పింఛన్లు పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, అధికారులు పాల్గొన్నారు. తొలిరోజు 24 మండలాలతో పాటు, అనకాపల్లి జీవీఎంసీ, ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల పరిధిలో 97.08 శాతం పింఛన్ల పంపిణీ చేశామని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తెలిపారు. 2,60,816 లబ్ధిదారులకు రూ. 104.57 కోట్లు అందించామని, ఇంకా 7446 మంది లబ్ధిదారులు మిగిలిపోయారన్నారు. వీరికి బుధవారం అందజేస్తామన్నారు.

## 4న పీలా ప్రమాణ స్వీకారం

అనకాపల్లి, న్యూస్‌టుడే: పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల కల్పన సంస్థ రాష్ట్ర ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఈనెల 4న ప్రమాణ స్వీకారం చేస్తారు. విజయవాడ శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీలోని కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బాధ్యతలు స్వీకరిస్తారు.



# కలెక్టర్ పేరిటా టోకరా

## జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలు

ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం

**సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. అధికారులు, అనధికారులు, విద్యావంతులు, నిరక్షరాస్యులు, విద్యార్థులు.. ఇలా ఎవరినీ వదలకుండా నగదు కాజేస్తున్నారు. ఇప్పుడు ఏకంగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఫొటోతో ఒక ఫోన్ నంబరు నుంచి ఉన్నతాధికారులకు వాట్సాప్ సందేశాలు పంపారు. తాను అర్జెంట్ మీటింగ్‌లో ఉన్నానని, రూ.50 వేలు ఇస్తే సాయంత్రానికి తిరిగి జమ చేస్తానంటూ బ్యాంకు అకౌంట్ నంబరు, పాన్‌కార్డు నంబరుతో సహా వాట్సాప్ సందేశం పంపారు. అనుమానం వచ్చిన అధికారులు కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఆమె సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు అకౌంట్ ఆధారంగా సౌరభ్ అనే పాత నేరస్థుడిగా గుర్తించారు. గతంలో జడ్పీ సీఈఓ పేరుతో ఇలా నగదు అడిగాడు.**

ఇదివరకు అనకాపల్లి జిల్లాలో పనిచేసిన కలెక్టర్ రవి తనకు అర్జెంట్‌గా రూ.50 వేలు కావాలని అడిగినట్లు ఆర్డీవో చిన్నికృష్ణకు ఫోన్ సందేశం వచ్చింది. దీన్ని నమ్మిన ఆర్డీవో రూ.50 వేలు ఇచ్చారు. తీరా తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని ఉత్తరప్రదేశ్‌లో పట్టుకున్నారు.




**పోలీసుల దృష్టికి రానివెన్నో..** ఒకప్పుడు ఇంట్లో చోరీలు, దారి దోపిడీల్లో సొత్తులు కాజేయడం ఉండేవి. ఇప్పుడు తీయటి మాటలు.. ఓటీపీలు.. లింక్‌లు ఓపెన్ చేయడం చేయిస్తూ నగదు కాజేస్తున్న సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఇంట్లోనే ఉంటూ అధిక జీతాలు పొందడం. వ్యాపారాలను ఆదాయపు పన్ను, పోలీసు అధికారుల పేరుతో బెదిరించి నగదు మాయం చేసే ముఠాలు పెరుగుతున్నాయి. ఈ తరహా మోసాలకు పాల్పడుతున్న వారిలో చాలా మంది ఫిర్యాదులు చేయడానికి ముందుకు రావడం లేదు. ఫిర్యాదు చేసినా చాలా వరకు కేసులు పరిష్కారం కాని దుస్థితి నెలకొంది.


★ ఇటీవల అనకాపల్లికి చెందిన దంతవైద్యుడిని బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం చేస్తున్నానంటూ ఒక వ్యక్తి నమ్మించాడు. తమ వద్ద 155 మంది సైనికులను దంత వైద్యం మీ వద్దనే చేయిస్తామని బిల్లులు పెట్టుకోవచ్చని నమ్మించాడు. తొలుత విషయాన్ని నమ్మన్ని దంత వైద్యుడు ఫోన్ చేసిన వ్యక్తి క్రెడిట్ కార్డు వివరాలు చెప్పి నగదు పంపడంతో పంపిన లింక్‌ను ఓపెన్ చేశాడు. రూ.1.75 లక్షల వరకు నగదు కాజేశాడు.

★ అనకాపల్లిలోని బ్యాంకు ఉద్యోగిని వాట్సాప్ గ్రూపులో చేర్చిన అపరిచిత వ్యక్తి దీంట్లో ఉన్న వారితో వ్యాపారం చేస్తే లాభాలు ఆర్జించొచ్చని నమ్మించాడు. ఇలా దఫదఫాలుగా రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టించాడు. వాట్సాప్ నుంచి గ్రూపు నంబర్లు డిలీట్ అవ్వడంతో అనుమానం వచ్చి ఆ ఉద్యోగి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రూ. 5.40 లక్షల వరకు అకౌంట్‌లో నగదును సీజ్ చేయగలిగారు. విశాఖపట్నంలో ఈమేరకు కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నారు.

### జిల్లాకో సైబర్ స్టేషన్

జిల్లాకొక సైబర్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తేనే గానీ ఈ సమస్య తీరదని కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. జిల్లాలో ఐటీ కోర్ ఉంది. సీఐ, ఎస్సై, 10 మంది సిబ్బంది పనిచేస్తుంటారు. వీరు సైబర్, సోషల్ మీడియా, సెల్‌ఫోన్లు పోగొట్టుకోవడం తదితర కేసులను ఛేదించడానికి పోలీస్‌స్టేషన్‌కు సాంకేతికపరంగా సహకారాన్ని అందిస్తున్నారు.

### నేరాల ముఖచిత్రం ఇలా..






### మాటలకు మోసపోవద్దు

సైబర్ నేరగాళ్ల మాటలకు మోసపోవద్దు. కొత్త తరహాలో వీరు మోసం చేస్తున్నారు. అపరిచిత వ్యక్తులతో సంభాషణ మంచిది కాదు. ఆశచూపించి మన వద్ద నగదు కాజేసేలా సైబర్ నేరగాళ్లు వల పన్నుతున్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోను మెసేజ్‌లు వస్తే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలి.

**-వినోద్‌బాబు, సీఐ, జిల్లా సైబర్, సోషల్ మీడియా సెల్**

## బండలను చూస్తే బేజారే!



లారీ వెనుక జారేలా కనిపిస్తున్న బండరాళ్లు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డులో బండరాళ్ల రవాణా చేసే లారీలను చూసి ప్రయాణికులు ఆందోళన చెందుతున్నా పోలీసులు, రవాణాశాఖాధికారులు కనీసం పట్టించుకోవడంలేదు. అధిక బరువుతో రోడ్లను ధ్వంసం చేసే విధంగా బండరాళ్లను రవాణా చేస్తూ ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ రాయి జారిందంటే వెనక వచ్చే వారి ప్రాణాలు గాల్లో కలిసిపోయినట్లే!



లారీలో రాళ్ల రవాణా

## పిల్లలకు సెలవు ఇవ్వాల్సిందే

కలెక్టరేట్, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈనెల 3 నుంచి 13 వరకు బంధువులు, కుటుంబ సభ్యుల మధ్య పండగను ఆనందంగా జరుపుకోవడానికి ప్రభుత్వం సెలవులు ప్రకటించిందన్నారు. సెలవులు విధిగా అమలు చేయాలని కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారన్నారు. అతిక్రమిస్తే పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామన్నారు.





## హోరాహోరీగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



ఎలమంచిలి-అరకులోయ జట్ల మధ్య పోటీ

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెదగుమ్ములూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను తెదేపా నాయకుడు నవీన్‌రాజు, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి ప్రారంభించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 15 నియోజకవర్గాల జట్లు పోటీల్లో తలపడ్డాయి. వ్యాయామ ఉపాధ్యాయులు నిర్మల, శ్రీనివాసరావు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

## చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



నర్సీపట్నం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన మాసిన వెంకటేశ్వరరావు రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. చదరంగం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన విలేకరులకు తెలిపారు.

## పల్లాకు నేతల కృతజ్ఞతలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల సంస్థ, గృహ నిర్మాణ సంస్థల ఛైర్మన్లుగా నియమితులైన పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబులు మంగళవారం తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. గాజువాకలో పల్లాను కలసి తమకు పదవులు రావడానికి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపి పూలదండతో సత్కరించారు.



పల్లాను పూలదండతో సత్కరిస్తున్న పీలా, బత్తుల

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాదిలో తాతయ్యబాబును గృహ నిర్మాణ సంస్థ నర్సీపట్నం ఈఈ నీరజ, జేపీసీ నాయకులు శేఖర్, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన డిప్యూటీ ఈఈ, డీఈఈ, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఎలమంచిలిలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఆగితే మేలు!




ఎలమంచిలి రైల్వే స్టేషన్

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో రైలు ప్రయాణికుల కష్టాలు తప్పడంలేదు. కీలకమైన రైళ్లకు హాల్ట్ లేక ఇబ్బంది పడుతున్నారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ తరవాత మధ్యాహ్నం వరకు ఈ రైల్వే స్టేషన్‌లో రోజు తిరిగే రైళ్లు ఆగడం లేదు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఇక్కడ హాల్ట్ కల్పిస్తే ప్రయాణికులకు ఆసరాగా ఉంటుంది.

ఎలమంచిలి రైల్వేస్టేషన్ నుంచి రోజు ఐదువేల మందికి పైగా రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో రోజువారీ ప్రయాణికులే ఎక్కువ! వీరంతా ఉపాధి కోసం రోజూ ఇటు అనకాపల్లి, విశాఖపట్నం.. అటు తుని, కాకినాడ వైపు చాలా మంది వెళ్తుంటారు. మరికొందరు హైదరాబాద్, విజయవాడ, బెంగళూర్, చెన్నై, తిరుపతి ప్రాంతాలకు ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తారు. ఇక్కడ ప్రయాణికుల రద్దీ ఉన్నా రైళ్లకు హాల్టులేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటు తుని అటు అనకాపల్లి వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోంది.

విజయవాడ వైపు వెళ్లడానికి తెల్లవారుజామున 4.30 గంటలకు పూరీ తిరుపతి, 5 గంటలకు ఈస్ట్‌కోస్ట్, 7.10 గంటలకు జన్మభూమి, 8.15కు సింహాద్రి, 9.30 గంటలకు బొకారో ఎక్స్‌ప్రెస్ ఆగుతుంటాయి. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల ఎక్స్‌ప్రెస్ వచ్చే వరకూ మధ్యలో విజయవాడవైపు వెళ్లడానికి రైళ్లు లేవు. భువనేశ్వర్-బెంగళూర్ మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఇక్కడ ఆగితే ఎంతో మందికి ప్రయోజనం కలుగుతుంది. విశాఖ వెళ్లడానికి ఉదయం 9.50 గంటలకు ఎలమంచిలి వస్తుంది. విజయవాడ వైపు వెళ్లడానికి మధ్యాహ్నం 2.15 గంటలకు ఎలమంచిలి వస్తుంది. విశాఖ, విజయవాడ మార్గాల్లో ప్రయాణించే వారికి ఈ రైలు అనుకూలంగా ఉంటుంది. దీనిపై అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కృషి చేస్తే ఈ ప్రాంత ప్రయాణికులకు వెసులుబాటు కలుగుతుంది.



### కొత్త రైళ్లు ఆపాలి

పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందడంతో పాటు ఎన్ఏవోబీ రాకతో ఎలమంచిలి స్టేషన్‌కు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ స్టేషన్ మీదుగా రాకపోకలు చేసే ప్రయాణికుల సంఖ్య పెరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకుని కొత్త రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి. **- కె.సత్యనారాయణ, రోజువారీ ప్రయాణికుల సంఘం అధ్యక్షులు**





## చెక్కపై గాంధీ రూపం

గాంధీ జయంతిని పురస్కరించుకుని నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లుకు చెందిన సూక్ష్మ కళాకారుడు, కార్పెంటర్ దార్ల రవి చెక్కపై గాంధీజీ చిత్రాలను చక్కగా మలిచారు. ఇందులో గాంధీతో పాటు అశోక చక్రం, అదేవిధంగా రెండు అంకెతో గాంధీ రూపాన్ని మలిచారు. ఇందుకు రెండు గంటల సమయం పట్టినట్లు రవి వెల్లడించారు.

– నక్కపల్లి, న్యూస్‌టుడే

# ఆకాశమంత ఊయల.. ఉత్కంఠ రేపే వేడుక!

ఎలమంచిలి మండలం జంపపాలెం గ్రామం నువ్వా.. నేనా అన్నట్లుగా సాగే చెక్కల (తాటిచెట్టు ఎక్కే) ఊయల పోటీ కోసం ఎదురుచూస్తోంది. ఒకింత గగుర్పాటుకు గురిచేసే ఈ వేడుక మరిడమ్మ జాతరలోని ప్రధాన ఘట్టం.. దాదాపు 400 ఏళ్ల చరిత్ర కలిగిన రావిచెట్టు కింద వెలసిన మరిడిమాంబ జాతర ఏటా అక్టోబర్‌లో నిర్వహిస్తారు. ఈ ఏడాది పండగను బుధ, గురువారాల్లో వేడుకగా చేసుకునేందుకు సర్వం సిద్ధం చేశారు. తొలిరోజు నుంచి గ్రామంలో సంబరాలు అంబరాన్ని అంటుతాయి.

– న్యూస్‌టుడే, ఎలమంచిలి



200 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం

జంపపాలెం మరిడిమాంబ జాతరలో భిన్న సంస్కృతి


ఉయ్యాల కోసం సిద్ధం చేసిన తాటి దుంగలు

పండగ రెండు రోజుల్లో తొలిరోజు తొలేళ్ల సంబరాన్ని సందడిగా నిర్వహిస్తారు. అర్ధరాత్రి రెండు గంటలు దాటిన తర్వాత జాతరలో కీలక ఘట్టమైన భారీ ఊయలను ప్రతిష్ఠించే (ఊయల చెక్కలు) పోటీ నిర్వహిస్తారు. దీన్ని యువత అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటారు.

❖ తొలుత గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో నదీ తీరాన అప్పటి రాజులు కేటాయించిన స్థలంలో ఉన్న ఓ తాటి చెట్టును రెండుగా విభజించి ఉంచుతారు. రాత్రి 10 గంటల సమయంలో గ్రామంలో ఉన్న యువత, గ్రామపెద్దలు చెట్టు వద్దకు వెళతారు. అక్కడ రెండువర్గాలుగా వీడి సంబరం జరిగే సతకంపట్టు వద్దకు వాటిని చీకట్లోనే పోటీగా భుజాన మోసుకుని తీసుకొస్తారు. ఇది తుది పోటీలకు ట్రయల్ రన్ వంటిది.

❖ అనంతరం వాటిని చెక్కి, ఊయలకు ఉపయోగపడే చెక్కలుగా తయారు చేస్తారు. దీనికి పశువుల చర్మంతో చేసిన ఒరిమితాడును వినియోగిస్తారు. దీంతో ఎంత బరువైన వ్యక్తి ఎక్కినా తెగకుండా ఉంటుంది.

**ప్రమాదాన్ని ఎదురించి.. విజేతలుగా నిలిచి..**

భారీ జనసందోహం నడుమ అసలైన చెక్కలు ఎత్తే పోటీ మొదలవుతుంది. అప్పటికే తవ్విన గోతుల్లో రెండు చెక్కల మొదళ్లు ఉంచుతారు. వాటికి తాడుకట్టి ఉంచుతారు. గ్రామస్థులంతా యల్లపు, శిలపరశెట్టి ఇంటిపేర్లతో రెండు వర్గాలుగా విడిపోతారు. నేలపై వాల్చి ఉన్న రెండు చెక్కలపైన పోటీలో నైపుణ్యమున్న ఇద్దరు వ్యక్తులు ఒకోదానిపై సిద్ధంగా ఉంటారు. అర్ధరాత్రి రెండు గంటలు దాటిన తర్వాత పెద్దలు నిర్ణయించిన ముహూర్తాన రెండు వర్గాల వారూ ఒక్కసారిగా చెక్కలను పైకి ఎత్తుతారు.

❖ ఆ సమయంలో చెక్కలు అటూఇటూ వాలిపోతూ, జనాలపై పడిపోతూ పైకి లేస్తాయి. ఈ సమయంలో అనేకమంది గాయాలపాలైన ఘటనలు గతంలో ఉన్నాయి. అలా క్షణాల్లో పైకి లేపుతారు. అనంతరం చెక్కపై ఉన్న వ్యక్తులు దానికి బిగించి ఉన్న తాడును కింద పడేసి ఎవరైతే ముందుగా దిగివస్తారో వారినే విజేతగా ప్రకటిస్తారు. అనంతరం భారీస్థాయిలో బాణసంచా కాల్చుతూ అమ్మవారిని ఆ ఊయలపై ఊగిస్తారు. అలా తొలిఘట్టం ముగుస్తుంది. దేశ నలుమూలల్లో స్థిరపడిన వారు ఈ పండగకు గ్రామానికి వస్తారు.


**ఆనవాయితీని వీడలేదు..:** మా తాతల నాటి నుంచి ఇదే ఆచారం కొనసాగుతోంది. కాలం మారుతున్నా ఆనవాయితీలను ఏనాడూ వీడలేదు. మా గ్రామంలో జరిగినట్లుగా ఎక్కడా పండగ జరగదు. ఇది మా గ్రామస్థులు చేసుకున్న అదృష్టం.. – కర్రి అప్పన్న, జంపపాలెం

**రాత్రంతా జాగారమే!..:** రెండురోజుల పండగైనా మా ఊరిలో ఊయల చెక్కల పోటీల పండగే సందడి ఉంటుంది. ఈ వేడుకను చూసేందుకు ముందుగానే ఎక్కడెక్కడ స్థిరపడిన వారంతా తరలివస్తారు.
– ఎల్లపు శ్రీరాములు, మాజీ సర్పంచి జంపపాలెం

# ఇంకెన్నాళ్లీ చుట్టుతిరుగుడు!

వరాహనది ఒడ్డున అందమైన గ్రామాలు. వారంతా బయటకు వెళ్లాలంటే ఏరు దాటాల్సిందే. ఇటీవల భారీ వర్షాలకు నది ఉగ్రరూపం దాల్చింది. కళ్లెదురుగా ఉన్న ఆవల ఒడ్డుకు చేరడానికి రోజూ నాలుగు గ్రామాల ప్రజలు చుట్టుతిరిగి రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

– న్యూస్‌టుడే, కోటవురట్ల



కోటవురట్ల మండలం పందూరు సమీపంలో పందూరు, ములగల్లోవ, బంద, గొట్టివాడ గ్రామాల ప్రజలు వరాహ నదిపై వంతెన ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురుచూస్తూనే ఉన్నారు. 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ. 9 కోట్ల నిధులతో ఈ వంతెన నిర్మాణం ప్రారంభించింది. స్తంభాల వరకు పూర్తయ్యాక 2019 ఎన్నికలొచ్చాయి. అప్పుడు అధికారం చేపట్టిన వైకాపా రివర్స్ టెండర్ పేరుతో వంతెన పనులు నిలిపివేసింది. అప్పటి నుంచి నాలుగు గ్రామాల ప్రజలు పాట్లు పడుతూనే ఉన్నారు. ఈ గ్రామాల్లోని పలువురు విద్యార్థులు నర్సీపట్నం, అడ్డురోడ్డు ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. వీరితోపాటు బయట ప్రాంతాలకు వెళ్లాల్సినవారు సుమారు 5 కిలోమీటర్ల దూరం వెళ్తే తప్ప రవాణా సదుపాయం అందుబాటులోకి రావడం లేదు. వైకాపా నాయకుల మాయమాటలతో విసిగిపోయిన పందూరు, పరిసర గ్రామాల ప్రజలు ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో ఒకే మాటపై ఉండి, అత్యధిక శాతం కూటమికే ఓట్లు వేశారు. పాయకరావుపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వంగలపూడి అనిత హోం మంత్రి కావడంతో త్వరలో తమ కష్టాలు తీరతాయనే ఆశతో ఎదురుచూస్తున్నారు. దీనికి తగ్గట్టు మంత్రి అనిత సైతం ఈ వంతెన త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఈ మేరకు ఇటీవల పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులతో చర్చించారు. వంతెన పూర్తి చేయడానికి అయ్యే వ్యయం అంచనా వేసి, పనులు మొదలపెట్టాలని ఆదేశించారు. దీంతో పంచాయతీరాజ్, జలవనరుల శాఖ అధికారులు కలిసి అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెనను పరిశీలించారు. నిర్మాణ పనులు సాగుతున్న పరిసర ప్రాంతంలో మట్టిని సేకరించి, పరిశీలించడానికి తీసుకెళ్లారు.



**రోజూ 5 కిలోమీటర్ల నడక..:** వరాహ నదిలో నీరు ఎక్కువగా ఉంది. అందుకే సుమారు 5 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ పాతరోడ్డు వెళ్లి అక్కడ నుంచి, నర్సీపట్నం, అడ్డురోడ్డు, పాయకరావుపేట బస్సులు ఎక్కుతున్నాం.. వంతెన ఉంటే 5 నిమిషాల్లో బస్సులు ఆగేచోటకు వెళ్లిపోవచ్చు. కాలినడకన వెళ్లడం వల్ల సకాలంలో కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లలేకపోతున్నాం. – ఎస్.వెంకటేష్, ఐటీఐ విద్యార్థి, పందూరు

**భయమేస్తోంది..:** వరాహ నదిపై వంతెన పూర్తయితే నాలుగు గ్రామాల కష్టాలు తీరుతాయి. చిన్నపాటి ప్రవాహం ఉన్నా నది దాటడానికి భయమేస్తుంది. ఎందుకంటే ప్రవాహ ఉద్ధృతికి ప్రమాదాలు జరుగుతున్నాయి.
– రవితేజ, పందూరు

**రూ. 5.75 కోట్లు మంజూరు**

పందూరు వరాహ నదిపై అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి నాబార్డు ద్వారా రూ. 5.75 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం టెండర్ వేశాం. ఆ ప్రక్రియ పూర్తయితే వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.
– కుమార్‌రాజా, డీఈ, పాయకరావుపేట

## నేడు ఎంపీ రమేశ్ రాక

చోడవరం, న్యూస్‌టుడే: పార్లమెంట్ రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన ఎంపీ సీఎం రమేశ్ బుధవారం అనకాపల్లి రానున్నారు. ఆయనకు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసినట్లు భాజపా నాయకుడు నక్కా శ్రీనివాస్ మంగళవారం చెప్పారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

## టెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 16 నుంచి 20 వరకు టెట్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒకే కేంద్రంలో రెండు పూటలా పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. 600 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. పరీక్షా కేంద్రానికి డిపార్టుమెంటల్ అధికారిణిగా పరవాడ ఎంఈఓ సాయి శైలజను నియమించామన్నారు. ఆర్టీసీ బస్సులను కేంద్రానికి నడపాలన్నారు. అభ్యర్థులు సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ నంబరు 94412 38141, 94904 62025, 91770 42789 సంప్రదించాలన్నారు.

## విశాఖ ఉక్కుకు గనులు కేటాయించాలి


శిబిరంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేసి సొంత గనులు కేటాయించాలని ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు సిహెచ్ కిశోర్ డిమాండ్ చేశారు. నాలుగురోడ్లు కూడలి బస్టాప్ వద్ద మంగళవారం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ 32 మంది ప్రాణాలు త్యాగాలు, 67 మంది ఎమ్మెల్యేల రాజీనామాలతో స్టీల్‌ప్లాంట్ ఏర్పడిందన్నారు. 2014లో కేంద్రంలో భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి దీని ప్రైవేటీకరణకు చర్యలు చేపట్టారన్నారు. తక్షణమే ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. ఉక్కు పోరాటాల కోకన్వీనర్ ఆర్.దొరబాబు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపేక్షించేది లేదన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఈ శిబిరాన్ని ప్రారంభించి సంఘీభావం తెలిపారు. ప్లాంట్ ప్రైవేటీకరణను తాము వ్యతిరేకిస్తామన్నారు. కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

## హోంగార్డు కుటుంబానికి కారుణ్య నియామకం

అనకాపల్లి పట్టణం: స్టీల్‌ప్లాంట్‌లో డిప్యుటేషన్‌పై పనిచేసిన హోంగార్డు పైలా అప్పలనాయుడు అనారోగ్యంతో మృతిచెందగా ఇతని కుమారుడు శ్రీనివాస్‌కి కారుణ్య నియామక పత్రాన్ని ఎస్పీ దీపిక అందజేశారు. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని సూచించారు.

## పరిశ్రమల్లో భద్రతా తనిఖీలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం, పరవాడలోని పరిశ్రమల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. అచ్యుతాపురం సెజ్‌లోని పోరస్, సలోరా, పరవాడలోని ఎస్ఎన్ఎస్ కంపెనీలను మంగళవారం తనిఖీ చేశారు. లోపాలను గుర్తించి నివేదికలు అందిస్తామని డిప్యూటీ చీఫ్ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ నారాయణ తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ ముకుందరావు, పరిశ్రమల మేనేజర్ శ్రీధర్, అగ్నిమాపక దళ జిల్లా అధికారి వెంకటరమణ, బాయిలర్స్ అధికారి వీరభద్రరావు, కార్మిక శాఖాధికారి రమ్య పాల్గొన్నారు.

## రాబోయే అయిదురోజుల్లో చిరుజల్లులు

అనకాపల్లి, న్యూస్‌టుడే: రాబోయే అయిదు రోజులు జిల్లాలో చిరుజల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆవరణలో మంగళవారం వాతావరణ ఆధారిత సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు మాట్లాడుతూ చోడి పంటకు పేను బంక పురుగులు సోకే అవకాశం ఉందని తెలిపారు.

## రక్తదానానికి యువత చొరవ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ప్రపంచ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని డైట్ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్‌తో పాటు 385 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంకు అధికారి సునీత, కళాశాల ప్రిన్సిపల్ వైకుంఠరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం సెజ్‌లో మైథాన్ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలో మంగళవారం ఉచిత రక్తదాన శిబిరం జరిగింది. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా హరిపాలెం-అందలాపల్లి శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు కంపెనీ ఇన్‌ఛార్జ్ వేణుగోపాలరావు వెల్లడించారు. 45 మంది కంపెనీ ఉద్యోగులు, భక్తులు రక్త దానం చేశారు. వైద్యురాలు కనకదుర్గ, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు కశిరెడ్డి అప్పలనాయుడు, కేవీ.రావు, పైలా గోపి, ఆదినాగేశ్వరరావు, చంద్రశేఖర్, హెచ్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న రత్నాకర్, విద్యార్థులు

## విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో సోమవారం రాత్రి వినాయక నిమజ్జనోత్సవాల్లో అప్రశృతి చోటుచేసుకొంది. విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. దిమిలికి చెందిన పోలవరపు శ్యామ్ (22) పరవాడ మండలం రావాడలో తమ అమ్మమ్మగారి ఇంటి వద్ద ఉంటూ సౌండ్ సిస్టమ్ నిర్వాహకుడి వద్ద పనిచేస్తున్నాడు. మునగపాక పల్లపువీధికి చెందిన యువకులు సోమవారం రాత్రి వినాయక ప్రతిమను ఊరేగిస్తున్న తరుణంలో శ్యామ్ డీజే బాక్స్‌ల కనెక్షన్లు కలుపుతున్న తరుణంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు అనకాపల్లి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లుగా వైద్యులు తెలిపారు. మృతుని తండ్రి పైడికొండ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి.ప్రసాదరావు తెలిపారు. ఉత్సవాల్లో డీజే సౌండ్లను నియంత్రించాలని ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించక పోవడం వల్లే నిండుప్రాణం బలైపోయిందని తెదేపా నాయకులు మొల్లేటి సత్యనారాయణ, దాడి ముసిలినాయుడు ఆరోపించారు.

### రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు..

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి రైల్వేస్టేషన్‌ను ఆనుకొని సత్యనారాయణపురం రైల్వేట్రాక్ పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ జీఆర్పీ ఎస్సై కె.శాంతారాం కథనం ప్రకారం.. మృతుడు 35 నుంచి 40 ఏళ్లు ఉండి 5.7 అడుగులు ఎత్తు ఉన్నాడు. చామనఛాయ రంగులో, వైట్‌కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్టు, బ్రౌన్ కలర్ బనియన్ ధరించాడు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్సై తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 76739 06010ను సంప్రదించాలన్నారు.




యర్రవరంలో పరుగు తీస్తున్న గుర్రం

## ఘనంగా నల్లగొండమ్మ జాతర

నాతవరం, న్యూస్‌టుడే: తాండవ జలాశయం పరిసర ప్రాంతాల ప్రజలు ఆరాధ్యదైవంగా కొలిచే నల్లగొండమ్మ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. తాండవ జలాశయం నిర్మాణానికి ముందు నుంచే తాండవ, యర్రవరం, నాతవరంతోపాటు 30 గ్రామాల ప్రజలు ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. యర్రవరం, గుమ్ముడుగొండ, నాతవరం మూడు గ్రామాల్లోనూ మంగళవారం పోటాపోటీగా ఉత్సవాలు నిర్వహించారు. తాండవ ఆలయంలో నర్సీపట్నం పురపాలక సంఘం కౌన్సిలర్ చింతకాయల రాజేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేలవేషాలు, డ్యాన్స్ పోటీలు జరిగాయి. నాతవరంలో వెదురుపల్లి మహిళా బృందం కోలాటం అలరించింది. యర్రవరంలో రాష్ట్రస్థాయి గుర్రపు పందేలు ఆసక్తికరంగా జరిగాయి. నాతవరంలో తాండవ ఎడమ ప్రధాన కాలువ వద్ద నిర్మించిన ఆలయంలో నిర్మాణదారులు పోలిరెడ్డి రాజు ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

## ఆదుకునే ప్రభుత్వమిది : రాజు

చోడవరం, న్యూస్‌టుడే: అలజడులు సృష్టించడం, అన్యాయాలు చేసే గత ప్రభుత్వ పాలకులతో ప్రజలు విసిగిపోయి ఆదుకునే కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. సామాజిక భద్రత పింఛనుగా ఇచ్చి మొత్తాన్ని పెంచి భరోసా కల్పించిన ప్రభుత్వమిదని పేర్కొన్నారు. చోడవరం మండలం గవరవరంలో మంగళవారం పింఛను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు పంపిణీ చేశారు. ఎంపీడీవో ఆంజనేయులు, మాజీ సర్పంచి చప్పాగెడ్డ స్వామినాయుడు, తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు. చోడవరం పట్టణం, గ్రామాల్లో తెదేపా నాయకులు సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి నగదు అందజేశారు.


గవరవరంలో మంచానికి పరిమితమైన బాలుడికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు



## డంపింగ్ యార్డుకు చురుగ్గా స్థలాల పరిశీలన


అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

ఏళ్ల తరబడి వెంటాడుతున్న అనకాపల్లిలోని డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించేలా కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ నడిబొడ్డున్న ఉన్న ఈ యార్డును ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి మార్చేందుకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చర్యలు ముమ్మరం చేశారు. కొత్తూరు వద్ద ఉన్న యార్డును 2012లో తొలగించారు. అప్పటి నుంచి చెత్తను జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం పక్కగా ఉన్న స్థలంలో వేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ స్థలాన్ని యార్డుగా మార్చడంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకులేదు. పక్కనే పాఠశాల ఉండడంతో భరించలేని దుర్వాసనతో నిత్యం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.

★ అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడిన నేపథ్యంలో నివాసాల సంఖ్య పెరుగుతోంది. వాహనాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో ఉంచి ఇక్కడి నుంచి కాపులుప్పాడకు వాహనాల్లో తరలిస్తున్నారు. ఇక్కడ చెత్త నిల్వ చేయకుండా యార్డును వేరే చోటికి మార్చాలని చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఏ ప్రాంతంలో దీన్ని ఏర్పాటు చేయాలన్నా స్థానికంగా ఆందోళనలు, నిరసనలు తెలపడంతో అధికారులు ముందుకు వెళ్లలేకపోతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం కోసం కూటమి నాయకులు అధికారులతో కలిసి సమాలోచనలు చేస్తున్నారు.


జీవీఎంసీ కార్యాలయం పక్కన డంపింగ్‌యార్డు

**త్వరలో సమస్య పరిష్కరిస్తాం**



డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించేందుకు స్థలాల పరిశీలన చేపట్టాం. మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాలను చూశాం. ఒకదానిని ఎంపిక చేసి స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. వీలైనంత త్వరగా డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరిస్తాం. – అయ్యప్పనాయుడు, జీవీఎంసీ జోనల్ కమిషనర్, అనకాపల్లి

## పాఠశాల బస్సును ఢీకొన్న లారీ

### త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

కశింకోట, న్యూస్‌టుడే: జాతీయ రహదారి నర్సింగబిల్లి వద్ద మంగళవారం పాఠశాల బస్సును లారీ ఢీకొట్టింది. ఉదయం విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్లడానికి వస్తున్న బస్సును సోమవరం మలుపు వద్ద లారీ ఢీకొంది. ఈప్రమాదంలో బస్సు పక్కభాగం ధ్వంసమైంది. బస్సులో ఉన్న ఇద్దరు విద్యార్థుల్లో ఒక విద్యార్థికి స్వల్ప గాయమైంది. విద్యార్థులు ఎక్కువగా ఉంటే ప్రమాదం తీవ్రంగా ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. ఈసంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది.


ఘటనా స్థలంలో వాహనాలు

## శతాధిక వృద్ధుడి మృతి

మునగపాక, న్యూస్‌టుడే: ఒంపోలులో శతాధిక అర్చకుడు చంద్రమౌళి కామేశ్వరరావు మంగళవారం మృతిచెందాడు. ఈ గ్రామంలోని శివాలయంలో దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్నారు. అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామస్థులందరూ కామేశ్వరరావు అంత్యక్రియలు నిర్వహించారు.

## జాతీయ రాజకీయాల్లో ఏచూరిది చెరగని ముద్ర

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: నమ్మిన సిద్ధాంతం కోసం జాతీయ రాజకీయాల్లో సీతారాం ఏచూరి చెరగని ముద్ర వేసుకున్న నేతగా చరిత్రలో నిలిచారని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. అనకాపల్లిలో మంగళవారం జరిగిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విలువలకు నిలువెత్తు సాక్ష్యంగా ఆయన నిలుస్తారన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను రాజ్యసభ దృష్టికి తీసుకువెళ్లి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారన్నారు. మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, ఏపీ ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారు పీఎస్ అజయ్‌కుమార్, నాయకులు జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.


సీతారాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కొణతాల, చిత్రంలో పీలా, దాడి

## వివాహిత అదృశ్యం

అనకాపల్లి పట్టణం: అనకాపల్లి సమీపంలోని దేవీనగర్‌లో ఓ వివాహిత అదృశ్యమైంది నాలుగేళ్ల కుమార్తెతో కలసి సోమవారం ఇంటి నుంచి వెళ్లిన తన భార్య కనిపించడం లేదని భర్త మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

**చికెన్ ధరలు**
(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 107 | 98 |
| లైవ్ | 129 | 118 |
| డ్రెస్డ్ | 187 | 206 |
| స్కిన్‌లెస్ | 213 | 216 |

# అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

## వరద బాధితులకు సాయం

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట విజయవాడ వరద బాధితులకు విద్యార్థులు తమవంతు సాయం అందించారు. గ్రామంలో రూ.22,330 విరాళాలు సేకరించి ముఖ్యమంత్రి సహాయనిధికి డి.డి. రూపంలో మంగళవారం అందించారు. ఈ డి.డి.ని పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ కరణం శ్రీనివాసరావు, కూటమి నాయకులకు అందజేశారు. దానిని వీరు సీఎం సహాయ నిధికి పంపించారు.



పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్‌కు డి.డి. అందిస్తున్న తాళ్లపాలెం విద్యార్థులు

## పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలించి, వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు సూచించారు. ధర్మవరం-అగ్రహారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పదోతరగతి విద్యార్థుల నోటు పుస్తకాలను తనిఖీ చేశారు. దసరా సెలవుల్లోనూ ఇంటి వద్ద చదువుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేసి, ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. ఉపాధ్యాయులు లలితాంబ, కృష్ణవేణి, అప్పలనాయుడు, గారా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈఓ అప్పారావు

## సంపద కేంద్రాలను చెత్తగా మార్చొద్దు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో సంపద కేంద్రాలను చెత్తగా మార్చవద్దని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి, డీఎల్‌డీఓ మంజులావాణి కోరారు. ఎం.జగన్నాథపురం, ఖాజీపాలెం గ్రామాల్లో వారు మంగళవారం పర్యటించారు. గ్రామంలో చెత్తను సేకరించడం, తడి చెత్తను వర్మీ కంపోస్టు ఎరువుగా మార్చడం ద్వారా ఆదాయంలేని పంచాయతీలకు ఆదాయం లభిస్తుందన్నారు. సంపద సృష్టిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలన్నారు. వానపాములను విడుదల చేశారు. సర్పంచి కరెడ్ల బుల్లమ్మ, పీలా నర్సింగరావు, నాయకులు కరెడ్ల ప్రకాశ్, పీలా తులసీరామ్, సందీప్, పతివాడ చిన్నయ్యనాయుడు, కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ శిరీషారాణి, డీఎల్‌డీఓ మంజులావాణి

## డిసెంబరు నాటికి అనకాపల్లికి శుద్ధ జలాలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

అనకాపల్లి వాసులకు శుద్ధి చేసిన తాగు నీటి జలాలను అందించే పనులను ప్రారంభించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏలేరు కాలువ నీటిని శుద్ధిచేసి అగనంపూడి నుంచి అనకాపల్లికి పైప్‌లైన్ల ద్వారా అనకాపల్లి వాసులకు అందించాలని నిర్ణయించారు. రూ. 32 కోట్లతో చేపట్టే ఈ పనులకు 2019లో శంకుస్థాపన చేశారు. ఐదేళ్ల పాటు పనులను సాగదీస్తూనే ఉన్నారు. ఎన్నికలకు ముందు పనులు నిలిపేయడంతో అయోమయం నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పైప్‌లైన్ల పనులపై దృష్టి సారించింది. వీటిని వేగవంతం చేసేలా స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి తీసుకున్న చొరవతో పనులు ముందుకు సాగుతున్నాయి.

✦ అనకాపల్లి ప్రజలకు శుద్ధిచేసిన తాగునీటి జలాలు అందించాలని ఎంతో కాలంగా యోచిస్తున్నా ఆచరణ సాధ్యం కావడం లేదు. తొలుత శారదానది ఒడ్డున ఉన్న ప్రధాన పంప్‌హౌస్‌లో నీటిని ఫిల్టర్ చేసి పట్టణ వాసులకు అందించాలని చూశారు. దీనికోసం ప్రతిపాదనలు తయారుచేసినా అమలు కాలేదు. అగనంపూడి నుంచి అనకాపల్లికి 17 కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌లు వేసి శుద్ధి చేసిన తాగునీటి జలాలను అందించేలా పనులు చేపట్టారు. జీవీఎంసీ సాధారణ నిధులు రూ. 32 కోట్లను ఈ పనులకు కేటాయించారు. నేటికీ ఈ పనులు పూర్తికాలేదు. చేపట్టాల్సిన పైప్‌లైన్ల పనులు 18,000 మీటర్లు ఉండగా ఇప్పటి వరకు 15,602 మీటర్ల పనులు చేశారు. ఐదేళ్ల వైకాపా హయాంలో కాలం నెట్టుకొచ్చారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తిచేసి అనకాపల్లి వాసులకు శుద్ధిచేసిన తాగునీటి జలాలను అందిస్తామని జీవీఎంసీ అమృత ప్రాజెక్టు ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.



అగనంపూడి-అనకాపల్లి పైప్‌లైన్ పనులు



తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

## అర్హులకు త్వరలో కొత్త పింఛన్లు

అనకాపల్లి, న్యూస్‌టుడే: త్వరలోనే అర్హత ఉన్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. గవరపాలెం, మళ్లవీధి, భీమునిగుమ్మంలో మంగళవారం కూటమి నాయకులు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు పాల్గొన్నారు.

ఎలమంచిలి, అచ్యుతాపురం, మునగపాక, రాంబిల్లి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఇంటింటా తిరిగి పేదలకు పింఛన్లు పంపిణీ చేశారు. 300 మందికి పైగా ఆయన స్వయంగా పింఛన్లు అందించారు. కూటమి ప్రభుత్వం పేదల పక్షాన ఉంటుందన్నారు. మున్సిపల్ కమిషనర్ బాకూరి ప్రసాదరాజు, నాయకులు గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, కొరారు సాంబ, కరణం రవికుమార్, చిరంజీవి, రమణబాబు పాల్గొన్నారు ఎం.జగన్నాథపురం, మెలిపాకల్లో ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. చీమలాపల్లి, కొండకర్ల గ్రామాల్లో తెదేపా ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు పింఛన్లు అందించారు. ఉప్పవరంలో డీఎల్‌డీఓ మంజులావాణి ఈ పంపిణీని పరిశీలించారు. సర్పంచి బుల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు. నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, కె.చంద్రమోహన్, కొరపాటి రాజశేఖర్, మాధవరావు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో తెదేపా రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు పింఛన్లు పంపిణీ చేశారు.

పాయకరావుపేట, కోటవురట్ల, నక్కపల్లి, న్యూస్‌టుడే: పాయకరావుపేట మండలంలో 12,960 పింఛన్లకు తొలిరోజు 11,946 మందికి పంపిణీ చేశారు. మరో వెయ్యి మందికి పింఛన్లు ఇవ్వాల్సి ఉంది. పంపిణీని ఎంపీడీఓ జయప్రకాష్‌రావు, ఈఓఆర్‌డీ చంద్రశేఖర్ పర్యవేక్షించారు. కోటవురట్ల మండలంలో పింఛన్ల పంపిణీని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ పరిశీలించారు. రాజుపేట, కైలాసపట్నం, రాట్నాలపాలెం, కోటవురట్ల, తంగేడు గ్రామాల్లో పర్యటించారు. పెదతీనార్లలో ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు, మాజీ సర్పంచి గోసల చినతాతారావు తదితరులు పంపిణీ చేశారు. నక్కపల్లిలో ఎంపీడీఓ డి. సీతారామరాజు, కార్యదర్శి రాజశేఖర్ తదితరులు కార్యక్రమం చేపట్టారు.



అనకాపల్లిలో పింఛన్ అందిస్తున్న కొణతాల తదితరులు



ఎలమంచిలిలో పింఛన్ అందిస్తున్న విజయ్‌కుమార్



కోటవురట్లలో..

## అగ్నివీర్‌కు విద్యార్థుల ఎంపిక

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలకు చెందిన అయిదుగురు ఎన్‌సీసీ క్యాడెట్లు పి.మహేంద్ర, సతీష్, కె.రవితేజ, డి.లోకేష్, జి.చందు అగ్నివీర్‌కు ఎంపికయ్యారు. వీరిని మంగళవారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ గెల్లా జయబాబు తదితరులు అభినందించారు. వీరికి రూ.2000 చొప్పున అందజేశారు. కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, పర్యవేక్షకురాలు పెంటకోట అనూరాధ, వైస్ ప్రిన్సిపల్ టి. నిరంజన్‌కుమార్, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ దాడి జగదీష్, కెప్టెన్ ఏఏఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.



ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపల్

## రోగులకు ఆత్మీయ సేవలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులను ఆత్మీయంగా పలకరించి మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ ఎం.బాలాజీ కోరారు. హరిపాలెం పీహెచ్‌సీని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలు, రక్తపరీక్షలు, రికార్డులను పరిశీలించారు. జాతీయస్థాయి కార్యక్రమాలను శతశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీలపై పర్యవేక్షణ నిరంతరం ఉంటుందని సిబ్బంది, వైద్యులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. సిబ్బంది గణేష్, సునీత, ఉమామహేష్, శిరీష, శాంతి, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

## కామాక్షి ఆలయంలో భారీ ఏర్పాట్లు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: గవరపాలెంలో కొలువైన శ్రీకామాక్షి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాల కరపత్రాలను బుధవారం పాలకవర్గ సభ్యులు ఆవిష్కరించారు. కమిటీ ఛైర్మన్ కోటిపల్లి శ్రీను మాట్లాడుతూ గురువారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిస్తామని పేర్కొన్నారు. వీవీ రమణ రైతుభారతి హాల్లో 9, 10, 11 తేదీల్లో సురభి నాటకాల ప్రదర్శన, 14న ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. ప్రతినిధులు సతీష్, ధవలేశ్వరం లక్ష్మణరావు, కోటిపల్లి జేజిబాబు, కొమ్మోజు గోవిందరాజు, పొన్నాడ వెంకట నర్సింహాచారి పాల్గొన్నారు.

## అ వీ ఇ వీ

### సేవా కార్యక్రమాల్లో మమేకం కావాలి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో మమేకం కావాలని తెదేపా మండలశాఖ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు రూ.5 వేల చెక్కును నందమూరి కల్చరల్ యూత్ సభ్యులు అందజేశారు. యూత్ గౌరవ అధ్యక్షుడు చింతకాయల రాంబాబు, పెదిరెడ్డి ప్రసాద్, విశ్వనాథుని శ్రీను, బి.గోవిందరావు, జి.అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

### రెండు ఇసుక లారీల పట్టివేత

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు రెండు లారీలను కాగిత టోల్‌ప్లాజా వద్ద మంగళవారం పట్టుకున్నట్లు సీఐ కె.కుమారస్వామి తెలిపారు. వీటిపై కేసు నమోదు చేసి వాటిని సీజ్ చేశారు.

### తహసీల్దార్ రమేష్‌బాబు బాధ్యతల స్వీకరణ

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం తహసీల్దార్‌గా జె.రమేష్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అచ్యుతాపురం నుంచి బదిలీపై వచ్చిన ఉప తహసీల్దార్ నీరజ బాధ్యతలు స్వీకరించారు.

### విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: కొరుప్రోలు సెక్షన్ పరిధిలోని పెదఉప్పలం, వమ్మవరం గ్రామాలకు బుధవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 5 గంటల వరకు సరఫరా నిలివేస్తున్నట్లు పేర్కొన్నారు.

### పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

అనకాపల్లి: జీవీఎంసీ 84వ వార్డులో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలను కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి మంగళవారం పంపిణీ చేశారు. నాయకులు ఎం.నీలిబాబు, తలారి లక్ష్మిప్రసాద్, చంద్ర పాల్గొన్నారు.

### వివాహిత అదృశ్యం

రాంబిల్లి, న్యూస్‌టుడే: గొరపూడి శివారు అప్పన్నపాలెం గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు సీఐ నరసింగరావు చెప్పారు. గతనెల 7న సెజ్‌లో పనికి వెళ్తానని చెప్పి తిరిగి రాలేదన్నారు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### అనుమతుల్లేని డ్రోన్లపై చర్యలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అనుమతుల్లేని కుండా డ్రోన్లు ఎగరవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ హెచ్చరించారు. అచ్యుతాపురం పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫొటోగ్రాఫర్ల సంఘం ప్రతినిధులతో సీఐ సమావేశమయ్యారు. శుభ కార్యాలయాలకు ముందుగా అనుమతి తీసుకుని డ్రోన్లు వినియోగించాలని కోరారు.

## జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అచ్యుతాపురం, కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అచ్యుతాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు హెచ్‌ఎం పద్మావతి, జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు బహుమతులు అందజేశారు. అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ బి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికి తీయడానికి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

పాయకరావుపేట, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: చెకుముకి పరీక్షల్లో పాయకరావుపేట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. వీరిని హెచ్‌ఎం భవాని, ఉపాధ్యాయులు అభినందించారు. దార్లపూడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం రమణశ్రీ తెలిపారు.



విద్యార్థులతో హెచ్‌ఎం పద్మావతి, ప్రతినిధులు

## ఆనందంతోనే ఆరోగ్యం



హరిపాలెంలో వృద్ధులతో వైద్యసిబ్బంది

కశింకోట, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఆనందంతోనే ఆరోగ్యంగా సాధ్యమని వైద్యాధికారి యు.రమేష్ అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం తాళ్లపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వృద్ధుల ఆరోగ్యంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఆరోగ్య సిబ్బంది ఎం.ఎస్.వి.ప్రసాద్, వి.ఏ.సుబ్బారావు, నరసింహారావు, ఆశాలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు. బయ్యవరంలో సన్నీయూత్ ఆధ్వర్యంలో 100 మంది వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. హరిపాలెం, అచ్యుతాపురం పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారిణి మానస ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు జరిగాయి. వైద్యులు కూండ్రపు శ్రావ్య, విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణకు సహకరించండి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం కూడలి విస్తరణకు నిర్వాసితులు సహకరించాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కోరారు. అచ్యుతాపురం కూడలిలో ఇళ్లు, దుకాణాలు తొలగింపు పనులను ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. నిర్వాసితులకు ఇబ్బందిలేకుండా ఉండాలనే లక్ష్యంతో ఎవరు భవనాలు వారే తొలగించడానికి అవకాశం కల్పించినా జాప్యం జరుగుతుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. నాయకులు ద్వారపురెడ్డి బాబ్జీ, బైలపూడి రాందాసు తదితరుల పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## భవన నిర్మాణ కార్మికుల నిరసన

రాంబిల్లి, అచ్యుతాపురం, కశింకోట, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక అందించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండు చేశారు. మంగళవారం భవన నిర్మాణ కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. నాయకులు సీహెచ్.రామకృష్ణ, ఎస్.రాంబాబు, రాము, సర్పంచి ఎనమరెడ్డి శ్రీనివాసరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు. హరిపాలెం, దోసూరు, అచ్యుతాపురం గ్రామాల్లో నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, నాయకులు కొండపు రాజు, శ్రీను, రమేష్‌రరాజు, రాజాన అప్పలనాయుడు, బాబూరావు, హరి, వసంత పాల్గొన్నారు. కశింకోటలో సీఐటీయూ నాయకులు దాకారపు శ్రీనివాసరావు, బి.మహేష్, జి.అప్పలకొండ, డి.సత్యారావు, పి.తాతబ్బాయి, పి.లోవరాజు, ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





రాంబిల్లి కార్మికుల నినాదాలు

## మహాత్ముడికి బాలల నివాళి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని పాఠశాలలో మంగళవారం గాంధీజయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులంతా మహాత్ముడికి నివాళులర్పించారు. బాలల నాట్య ప్రదర్శన అబ్బురపరిచింది. ఈ సందర్భంగా కొందరు విదార్థులు చరఖాతో ఖద్దరు వస్త్రాలు తయారీని ప్రదర్శించి అందరినీ అలరించారు.



చరఖాతో వస్త్రాల తయారీని ప్రదర్శిస్తున్న చిన్నారులు

## మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ పెంపు

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్న కోడిగుడ్లు, చిక్కీలను మంగళవారం ఎంఈఓ బుద్ధ శివనాయుడు పరిశీలించారు. కాలం చెల్లిన చిక్కీలు విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం పాఠశాలకు చేరుకుని పరిశీలించారు. ప్యాకెట్‌ను గమనించక పోవడం వల్ల కొంతమంది విద్యార్థులకు పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు. ఇకపై అలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంఈఓ శివనాయుడు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, విద్యాకమిటి ఛైర్మన్ ఆడారి సూర్యచంద్రరామారావు, సీఆర్‌పీలు అచ్యుతకృష్ణ, గోవింద పాల్గొన్నారు. కాలం చెల్లిన చిక్కీలు పంపిణీ చేయడాన్ని జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ అభ్యంతరం చెప్పారు. నాణ్యమైన వాటిని విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



కోడిగుడ్లు పరిశీలిస్తున్న ఎంఈఓ శివనాయుడు

## రహదారి పనులు పునః ప్రారంభం

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి జలగల మదుం వద్ద మంగళవారం రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. వీటిని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాంకీ పరిశీలించారు. సుంకరమెట్ట నుంచి జలగల మదుం వరకు రూ.2.03 కోట్లతో పనులు చేపట్టారు. స్థల యజమానులకు టీడీఆర్‌లు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే స్థల యజమానులను సంప్రదించారు. టీడీఆర్‌లు అందించే బాధ్యత తనదని భరోసా ఇవ్వడంతో రహదారి నిర్మాణానికి వారు అంగీకరించారు. దీంతో పనులు ప్రారంభమయ్యాయి.



పనులు పరిశీలిస్తున్న కొణతాల

### ఆసుపత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించరూ..

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

### మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

నెహ్రూచౌక్ (అనకాపల్లి): మహిళ రక్షణ చట్టాలపై అవగాహన తప్పనిసరి అని మహిళ పోలీస్ స్టేషన్ సీఐ ఆర్‌వీవీఎస్‌సీహెచ్.శేఖరరావు పేర్కొన్నారు. పట్టణంలో ఓ కళాశాలలో మంగళవారం విద్యార్థినులకు మహిళ రక్షణ, భద్రత, సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఎస్సై రాములమ్మ, ప్రిన్సిపల్ సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఎంఆర్‌సీ కార్యాలయానికి వితరణ

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక ఎంఆర్‌సీ కార్యాలయానికి మునగపాక, నాగులాపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయినులు సావిత్రి, జి.రాజ్యలక్ష్మి బీరువా, టేబుల్ అందజేశారు. వీరిని సహ ఉపాధ్యాయులు అభినందించారు.

### దేశ రక్షణ బాధ్యతలో యువత కీలకం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని మాజీ సైనిక ఉద్యోగి బి.ప్రకాష్‌రావు పేర్కొన్నారు. పట్టణంలో జీవీఎంసీ పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వీరగాథ-4.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. కార్గిల్ యుద్ధ సన్నివేశాలను విద్యార్థులకు వివరించి వారిలో ఉత్తేజం కల్పించారు. మాజీ సైనికద్యోగులు జయచంద్ర, హెచ్‌ఎం రుధిరరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మద్యం దుకాణాల సిబ్బంది ఆందోళన

అనకాపల్లి పట్టణం, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్‌లు, సేల్స్‌మేన్‌లు మంగళవారం ఆందోళనకు దిగారు. మంగళవారం ఉదయం నుంచి మద్యం దుకాణాలు తెరవకుండా ఆందోళన చేపట్టారు. తమకు ఉపాధి భరోసా కల్పించాలని అచ్యుతాపురంలో నిరసన వ్యక్తంచేశారు. తమను తొలగిస్తే రాష్ట్రం వ్యాప్తంగా 15వేల కుటుంబాల రోడ్డున పడతాయన్నారు.

## అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

ఎలమంచిలి, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎలమంచిలి స్టేషన్ రోడ్డు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల పీడీ మూర్తి చెప్పారు. అచ్యుతాపురంలో నిర్వహించిన పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచారన్నారు. నానేపల్లి దుర్గ, బొద్దపు జగన్, చాపల హరి, పరుగు పందాల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిని హెచ్‌ఎం భవానీ, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

### ఏయూ అంతర కళాశాలల బ్యాడ్మింటన్ విజేత ఎలమంచిలి

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఏయూ అంతర కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలు ఎంవీపీ కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనాలో మంగళవారం ముగిశాయి. పురుషుల విభాగంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎలమంచిలి) జట్టు ప్రథమ, అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్టు ద్వితీయ, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల జట్టు తృతీయ స్థానాల్లో విజయం సాధించాయి. మహిళల విభాగంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎలమంచిలి) జట్టు ప్రథమ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (శృంగవరపుకోట) ద్వితీయ, ఏయూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా కళాశాల జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేత జట్లకు ఏయూ వ్యాయామ విభాగాధిపతి ఆచార్య ఎన్.విజయమోహన్ పతకాలు, ట్రోఫీలను అందజేశారు.



అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: అనకాపల్లి గాంధీనగరంలో మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదు. దోమలు పెరిగిపోతున్నాయి. - ప్రకాశరావు, అనకాపల్లి

✓: సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. - రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్, అనకాపల్లి

## ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం

మునగపాక, న్యూస్‌టుడే: ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ఈ శాఖ జిల్లా అధికారి ప్రభాకరరావు తెలిపారు. నాగులాపల్లి రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. మామిడి, కొబ్బరి వంటి మొక్కలను రాయితీపై ప్రభుత్వం అందజేస్తుందన్నారు. బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను రాయితీపై పొందవచ్చని పేర్కొన్నారు. ఏఓ జ్యోత్స్నకుమారి, డి.శ్రీనివాసరావు, గోసాల గోవిందరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకరరావు

## విద్యార్థులకు బాసటగా నిలవడం అభినందనీయం

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సామాగ్రి, బుక్స్ లయన్స్ క్లబ్ ప్రోత్సాహం అందించడం శుభ పరిణామమని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జంపపాలెం ఉన్నత పాఠశాలలో ఎలమంచిలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాలను పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు బాసటగా నిలవడంపై సభ్యులను అభినందించారు. క్లబ్ సభ్యులు బంగారుశెట్టి, శంకరగిరి, కట్టా బాబ్జీ, హెచ్‌ఎం శాస్త్రి, సర్పంచి దేవకినాయుడు, బొద్దపు శ్రీను, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు శ్రీను పాల్గొన్నారు.

నర్సీపట్నం
• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

## డ్వాక్రా మహిళలకు ఆర్థిక తోడ్పాటు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: డ్వాక్రా మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నాయని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి చెప్పారు. పేర్కొన్నారు. ఇందులో భాగంగా వన్ నేషన్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) అందుబాటులోకి వచ్చిందన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. వెలుగు ఏపీఎం ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.


దేవరాపల్లిలో ఆహార ఉత్పత్తులను పరిశీలిస్తున్న పీడీ శచీదేవి

# పారిశుద్ధ్యం మెరుగుకు అడుగులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే

**శాసన సభాపతి అయ్యన్న చొరవతో నర్సీపట్నం పురపాలక సంఘం ప్రక్షాళన దిశగా అడుగులు పడుతున్నాయి. అధ్వానంగా మారిన పారిశుద్ధ్యాన్ని గాడిన పెట్టేందుకు బృహత్తర ప్రణాళిక సిద్ధమైంది. రూ.1.70 కోట్ల వ్యయంతో పురపాలక సంఘంలోని అన్ని ప్రాంతాలను పూర్తి స్థాయిలో పరిశుభ్రంగా ఉంచేందుకు పక్కా కార్యాచరణను రూపొందించారు. ఈ సొమ్ముతో అవసరమైన వాహనాలు, పరికరాలు కొనుగోలుకు వీలుగా కౌన్సిల్ ఆమోదం సైతం లభించింది.**


కాలువల్లో చెత్తచెదారాలకు తోడు ప్లాస్టిక్ వ్యర్థాల గుట్టలు

మున్సిపాలిటీలో గత కొన్నేళ్లుగా పారిశుద్ధ్యం పరిస్థితి పూర్తిగా గాడి తప్పింది. చెత్తను తరలించే పలు వాహనాలు మూలన పడ్డాయి. పని చేస్తున్నవి సైతం చిన్నచిన్న మరమ్మతులకు నోచుకోక పడకేస్తున్నాయి. రోజూ 28 టన్నుల పైగా ఇక్కడ చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇందులో సగం కూడా ఊడ్చలేని దుస్థితి. కొండల్లా వ్యర్థాలతో నిండిపోయిన డంపింగ్ యార్డులో వాహనాలు ప్రవేశించ లేకపోతున్నాయి. గతంలో విజయవాడ నుంచి రావడమే మరమ్మతులతో వచ్చిన క్లాప్ బ్యాటరీ ఆటోలతో ప్రయోజనం శూన్యమైంది. వార్డుల్లో రోజులు తరబడి నిల్వ ఉంటున్న చెత్తతో జనం నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కౌన్సిల్ సమావేశాల్లో దీనిపై అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఇద్దరిలోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. దారుణంగా తయారైన దీనిపై శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు తీవ్రంగా స్పందించారు. కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్రతో చర్చించారు. ఫలితంగా ఇప్పుడు పురపాలికలో పకడ్బందీ ప్రణాళికతో స్వచ్ఛతకు మార్గం సుగమం అవుతోంది.

### అగ్రో సంస్థ నుంచే కొనుగోలు

మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం మెరుగుకు మొత్తం రూ. 1.70 కోట్లు వెచ్చించేందుకు ప్రతిపాదించారు. దీనికి పురపాలక సాధారణ నిధులే వెచ్చించనున్నారు. దీనిపై కౌన్సిల్ సమావేశంలో కొద్దిపాటి వాగ్వాదాలు చోటుచేసుకున్నా తరవాత అందరి ఆమోదం లభించింది. ఆంధ్రప్రదేశ్ ఆగ్రో పరిశ్రమల అభివృద్ధి సంస్థ ద్వారా ఊరి స్వచ్ఛతకు అధికశాతం వాహనాలు, పరికరాలు కొనుగోలు చేసేందుకు నిర్ణయించారు. ప్రభుత్వ మార్గదర్శకాల్లోనూ ఈ సంస్థను సూచించినట్లు పేర్కొంటున్నారు. పరిశుభ్రతకు కేటాయించిన నిధులతో కొత్తగా ఒక కాంపాక్టర్, 20 తోపుడుబళ్లు, ట్రాక్టర్లు, ఫాగింగ్ యంత్రాలు, 30 కాంపాక్టర్ బిన్‌లు, పారిశుద్ధ్య పరికరాలు తదితర వాటిని కొనుగోలు చేయనున్నారు.


పూర్తి స్థాయిలో వినియోగంలోకి రావాల్సి ఉన్న డంపింగ్ యార్డు

### పూర్తి ప్రక్షాళనకు చర్యలు



మున్సిపాలిటీలో బాగా అడుగంటిన పారిశుద్ధ్యాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోనున్నాం. దీని కోసం రూ. 1.7 కోట్లతో సిద్ధం చేసిన ప్రతిపాదనలను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టాం. ఊరి స్వచ్ఛతకు కౌన్సిలర్లు తదితరుల అందరి సహకారం తీసుకుంటాం. 15వ ఆర్థిక సంఘం నిధులతో కొత్త జేసీబీని కొనుగోలు చేయాలని నిర్ణయించాం. త్వరలోనే ఇక్కడి చెత్తచెదారాలను కాపులుప్పాడు జిందాల్ ఎనర్జీ ప్లాంటుకు బిస్సుల్లో తరలించనున్నాం. డంపింగ్ యార్డులో ఇప్పటికే వాహనాలు తిరిగేలా ఏర్పాట్లు చేయడంతో ఊరిలో 90 శాతం చెత్తను ఇక్కడికే తరలించగలుగుతున్నాం.

– జంపా సురేంద్ర, మున్సిపల్ కమిషనర్, నర్సీపట్నం

## ఉదయం మూసి... సాయంత్రం తెరిచి!

నర్సీపట్నం అర్బన్, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: నర్సీపట్నం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కొంతమంది మద్యం దుకాణాల ఉద్యోగులు మంగళవారం ఇష్టాను సారం వ్యవహరించడం చర్చనీయమైంది. ఈ సర్కిల్‌లో 19 మద్యం దుకాణాలు ఉన్నాయి. కొంత మంది బృందంగా వచ్చి ఉదయం సీఐ సునీల్‌కుమార్‌ను కలిశారు. ప్రభుత్వ కొత్త మద్యం విధానం కారణంగా తమను ఉద్యోగం నుంచి తొలగిస్తే ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగేవరకు దుకాణాలు తెరిచేది లేదని పేర్కొన్నారు. దీనిపై సీఐ మాట్లాడుతూ సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా కమిషనర్‌ను కలిసి మాట్లాడాలని, దుకాణాలు మూస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దీంతో వీరంతా వెళ్లిపోయారు. దుకాణాలు తెరిచి లేకపోవడం గమనించిన మద్యం వినియోగదారులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన సీఐ ఉద్యోగులను హెచ్చరించడంతో సాయంత్రం పలువురు దుకాణాలు తెరిచారు. పలు దుకాణాల వద్ద రద్దీ కనిపించింది.


దేవరాపల్లిలో సిబ్బంది నిరసన

### మద్యం దుకాణాల మూసివేత

చోడవరం, దేవరాపల్లి, కె.కోటపాడు: కొలువులు కాపాడాలంటూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది మంగళవారం ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. చోడవరం పట్టణంలోని ఐదు మద్యం దుకాణాలు, మండలంలోని తొమ్మిది దుకాణాలు మంగళవారం మూతపడ్డాయి. రాజు, మధు. నాయుడు తదితరులు పాల్గొన్నారు. దేవరాపల్లి, కె.కోటపాడులోనూ మద్యం దుకాణాలను మూసివేసి నిరసన తెలిపారు.

## రహదారి గోతుల పూడ్చివేత

రోలుగుంట, న్యూస్‌టుడే: భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) మార్గంలో రోలుగుంట నుంచి కొత్తకోట వరకు గోతులను మట్టితో తాత్కాలికంగా పూడ్చడంతో వాహనదారులకు కొంత ఉపశమనం కలిగింది. 'పట్టరపట్టు.. గోతిలోనుంచి బయట పడేట్టు' శీర్షికన గత నెల 26న 'ఈనాడు'లో చిత్రవార్త ప్రచురితమైంది. స్థానిక నాయకులు స్పందించి గోతుల్లో మట్టి వేసి తాత్కాలికంగా పూడ్చారు.

స్పందనకు వందనం


బీఎన్ రోడ్డులో మట్టితో గోతులు పూడ్చుతున్న దృశ్యం

## మెగా రక్తదాన శిబిరం నేడు

బుచ్చెయ్యపేట: అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో వడ్డాదిలో బుధవారం మెగా రక్తదాన శిబిరం జరగనుంది. వెయ్యి యూనిట్ల రక్తం సేకరణ లక్ష్యంగా స్థానిక జడ్పీ పాఠశాల మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ సభ్యులు చెప్పారు.

## అక్రమ లేఅవుట్ పనులను ఆపాలి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: ఆర్లి పంచాయతీ పరిధిలో విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) అనుమతులు లేకుండా 46.62 ఎకరాల్లో లేఅవుట్ వేసి చదును చేసే పనులను వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు దాసరి వెంకన్న డిమాండ్ చేశారు. లేఅవుట్ ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. 18.26 ఎకరాల్లో లేఅవుట్‌కు అనుమతులు పొంది 46.62 ఎకరాలను చదును చేయడం నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు.

## తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: **సత్యం సుందరం**, ఆడి2: ఆడి3: **దేవర**, ఆడి4: **దేవర, మత్తు వదలరా**, రాజు: **దేవర, సత్యం సుందరం**, బంగార్రాజు: **దేవర**
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: **సత్యం సుందరం**, సాయిలక్ష్మి: **మత్తు వదలరా**, పూర్ణా: **దేవర**

## అవీ ఇవీ

### సీఎం సహాయ నిధికి వితరణ

చోడవరం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం చోడవరంలోని శ్రీవిఘ్నేశ్ జూనియర్ కళాశాల యాజమాన్యం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50 వేల విరాళం ఇచ్చింది. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే రాజు మంగళవారం కళాశాల కరస్పాండెంట్ ఈద్దె గోవిందరావు చెక్కు రూపేణా అందజేశారు. డైరెక్టర్లు రామకృష్ణ, దామోదర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### భాజపాలో పలువురి చేరిక

చీడికాడ: కోనాం పంచాయతీ కొండ్లత్తూరులో మంగళవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు మాట్లాడారు. గ్రామాల్లో సభ్యత్వ నమోదుపై దృష్టిసారించాలని నాయకులకు సూచించారు. అనంతరం భాజపా మండల అధ్యక్షుడు మురళీ సమక్షంలో పలువురు పార్టీలో చేరారు.

### జిల్లేడిపూడిలో ప్రాయశ్చిత్త దీక్ష

నాతవరం: తిరుమల లడ్డూ పవిత్రతకు భంగం కలిగించడంపై ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టామని జనసేన నియోజకవర్గ బాధ్యుడు రాజాన వీర సూర్యచంద్ర పేర్కొన్నారు. జిల్లేడిపూడిలోని శివలింగాకారం వద్ద ఆయన కార్యకర్తలతో కలిసి దీక్ష నిర్వహించారు. ఆలయాన్ని శుభ్రం చేశారు. జనసేన మండల అధ్యక్షుడు వెలగల వెంకటరమణ, యువజన అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### సమస్యలకు పరిష్కారం చూపండి

మాడుగుల గ్రామీణం: ఎస్సీ, ఎస్టీల సమస్యలకు పరిష్కారం చూపాలని ఎస్సీ, ఎస్టీ తాటిపర్తి గ్రామ కమిటీ సభ్యుడు మరువాడ ఈశ్వరరావు కోరారు. తాటిపర్తిలో మంగళవారం పోరాటకమిటీ దిశమోహన్ సమీక్ష నిర్వహించారు. ఎంపీడీడీ మీనాకుమారి, డీటీ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య సిబ్బందికి సన్మానం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది మెయిన్ పాఠశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందిని స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం సన్మానించారు. విశ్వతర్జని కొండయ్య రూ.2 వేల నగదు, దీర్ఘ బహూకరించారు. ప్రధానోపాధ్యాయులు శేషగిరి, ఛైర్మన్ మనోహర్, రమేష్, నరేష్ పాల్గొన్నారు.

### ఏకరూప దుస్తుల పంపిణీ

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పోలేపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. యాజమాన్య కమిటీ ఛైర్మన్ సీతా నాయుడుబాబు సహకారంతో 50 మందికి ఏకరూప దుస్తులు, మంచినీళ్ల సీసాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు పాత్రుడు, సీఆర్పీ శ్రీను పాల్గొన్నారు.

### వెంకన్నపాలెంలో సామూహిక సీమంతం

చోడవరం, న్యూస్‌టుడే: వెంకన్నపాలెంలో గర్భిణులకు మంగళవారం సామూహిక సీమంతం నిర్వహించారు. సర్పంచి మొల్లి ఈశ్వరరావు, మాజీ సర్పంచి బూర రమణ, జనసేన నాయకుడు సియాద్రి జగదీష్ పాల్గొన్నారు.

### నిర్మాణ కార్మికులకు ఈ-శ్రమ కార్డులు

కె.కోటపాడు: భవన నిర్మాణ కార్మికులందరూ ఈ-శ్రమ కార్డులు పొందాలని చోడవరం సహాయ కార్మికశాఖాధికారి సూర్యనారాయణ సూచించారు. కె.కోటపాడులో మంగళవారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశమయ్యారు. లక్ష్మణ, గంగరాజు, రమణ, శ్రీను పాల్గొన్నారు.

### జీతాలు చెల్లించాలని వినతి

కె.కోటపాడు: స్థానిక వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న పది మంది వీఓఏలు తమకు జీతాలు చెల్లించాలని కోరుతూ ఎంపీడీఓ సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు.

## సంకల్పంతో అన్నింటా విజయపథం

నర్సీపట్నం అర్బన్, మాకవరపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో విజయపథంలో దూసుకెళ్లే సంకల్పం కలిగి ఉండాలని మాకవరపాలెం ఎస్సై దామోదర్‌నాయుడు అన్నారు. మాకవరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తుల రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వినయ్, రూప, శ్రీధర్‌లకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, రాజు, ఆదినారాయణ, రంగారావు, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు. నర్సీపట్నం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ప్రతిభాపాటవ పరీక్ష నిర్వహించారు. ఆత్మకూ, జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారు. ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి అమరావతి స్కూల్, డాన్‌బాస్కో, విజయం సాధించినట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. త్రిమూర్తులురెడ్డి తెలిపారు. వేదిక ప్రతినిధి విశ్వనాథం సమన్వయకర్తగా వ్యవహరించారు. విజేతలకు ఉద్యోగులు యుల్లమండ, గౌరినాయుడు, శ్రీరామూర్తులు పర్యవేక్షించారు.

రోలుగుంట, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పోటీలు మంగళవారం జరిగాయి. కుసర్లపూడికి చెందిన ఆర్.మోహన్‌గాంధీ, ఆర్.శివశ్రీను, కె.అమృతవాణి విజేతలుగా నిలిచారు. రోలుగుంట పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్ ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. జన విజ్ఞాన వేదిక ప్రతినిధి కిరణ్‌కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నర్సీపట్నంలో పోటీలో పాల్గొన్న విద్యార్థులు

## బడిలో బాలగాంధీలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని కందిపూడి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు వినూత్నంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. వేషధారణలు, వివిధ రూపకాలు, నృత్యప్రదర్శనతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. మండల విద్యాశాఖాధికారి కాళీశ్వేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, జిల్లా కార్యదర్శి దేముడుబాబు పాల్గొన్నారు.


ఉప్పు సత్యాగ్రహ ఉద్యమ సన్నివేశం


పుస్తకపఠనం చేస్తున్న జాతిపిత


కందిపూడి పాఠశాలలో చిన్నారి బాపూజీలు

## ఆవగింజలతో అందంగా..

మాకవరపాలెం మండలం తూటిపాలకు చెందిన సూక్ష్మ కళాకారుడు రవికుమార్ మహాత్మా గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంతిని పురస్కరించుకుని వారి ముఖచిత్రాలను ఆవగింజలతో రూపొందించారు. 1,364 ఆవ గింజలతో తమలపాకుపై జాతిపిత.. 1,322 ఆవగింజలతో కాగితపు బోర్డుపై లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రాలు తీర్చిదిద్దారు. ఇందుకు 34 గంటలపాటు శ్రమించినట్లు చెప్పారు.

– మాకవరపాలెం, న్యూస్‌టుడే


తమలపాకుపై గాంధీ


లాల్ బహదూర్‌శాస్త్రి

## వక్తృత్వంలో నర్సీపట్నం విద్యార్థి ప్రతిభ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: సామాజిక అంశాలపట్ల అవగాహన పెంపుకుని అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించడం ద్వారా ఆత్మవిశ్వాసం మరింత ఇనుమడిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.పి.పద్మావతి అన్నారు. విజన్ స్వర్ణాంధ్ర-2047 జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రథమస్థానం పొందిన ఈ కళాశాల విద్యార్థి రావుల మౌళి కిరణ్‌ను మంగళవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో అభినందించారు. సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా అనకాపల్లిలో ఈ యువకుడు జ్ఞాపిక అందుకున్నారు. పలువురు అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ పద్మావతి

## రాష్ట్రస్థాయి పోటీలకు చెట్టుపల్లి బాలికలు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పోటీలకు చెట్టుపల్లి విద్యార్థినులు ఎంపికయ్యారు. ఉమ్మడి విశాఖజిల్లా స్థాయిలో పాడేరు తలారి సింగి పాఠశాలలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో ఏడో తరగతి విద్యార్థిని గజాల మానస గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికైంది. పరవాడలో నిర్వహించిన వుషూ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని జెర్రిపోతుల అంకిత గెలుపొందింది. వీరిని వ్యాయామ ఉపాధ్యాయుని గుడివాడ దేవి, ప్రధానోపాధ్యాయుడు పిట్టా రామకృష్ణ అభినందించారు.


విద్యార్థినులతో పీడీ దేవి, హెచ్‌ఎం రామకృష్ణ

## ఉత్సాహంగా రగ్బీ పోటీలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: దిబ్బిడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి రగ్బీ పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. పలు పాఠశాలల నుంచి 250 మంది బాలబాలికలు పాల్గొన్నారు. అండర్-14, 17 బాలుర, బాలికల విభాగంలో నాలుగు జట్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయుడు సత్యారావు, విద్యాకమిటీ ఛైర్మన్ అప్పారావు, సర్పంచి మాణిక్యం, వ్యాయామ ఉపాధ్యాయుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జట్టు

## సకాలంలో తెగుళ్లను గుర్తిస్తే ప్రయోజనం


జెడ్.జెన్నవరంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

రావికమతం, న్యూస్‌టుడే: వరిలో తెగుళ్లు వ్యాప్తిని సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే దిగుబడులపై ప్రభావం పడుతుందని వ్యవసాయాధికారి డి.రూప సూచించారు. జెడ్.జెన్నవరం, మత్స్యవానిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సౌజన్య, డాక్టర్ సత్తిబాబు కూరగాయల పంటలు, పూలు, డ్రాగన్ ఫ్రూట్స్ సాగులో మెలకువలు వివరించారు.

చీడికాడ, న్యూస్‌టుడే: జైతవరం, బైలపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వరిలో తెగుళ్ల నివారణపై వ్యవసాయాధికారిణి రమాదేవి రైతులకు సూచనలు చేశారు. క్రిమిసంహారక మందుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు, దేవరాపల్లి: కె.కోటపాడులో జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, ఏఓ సోమశేఖర్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. రాము తదితరులు పాల్గొన్నారు. దేవరాపల్లి, రైవాడ గ్రామాల్లో పొలంబడి నిర్వహించారు. చోడవరం వ్యవసాయ సహాయ సంచాలకులు రవీంద్రనాథ్, వ్యవసాయాధికారి కాంతమ్మ, సర్పంచులు లక్ష్మి, పెంటమ్మ, ఉప సర్పంచి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మాడుగుల గ్రామీణం: వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి వాసుదేవరావు రైతులకు సూచించారు. వీరనారాయణం, గొట్టివాడ అగ్రహారంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన అధికారిణి భానుపుష్ప లీలావతి, పశువైద్యాధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో 97 శాతం పింఛన్ల పంపిణీ

నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం 97 శాతం వరకు పూర్తయింది. ఉదయం 5.30 గంటలకే సిబ్బంది బట్వాడా ప్రారంభించారు. పురపాలక సంఘం పరిధిలో అన్నిరకాల పింఛనుదారులు కలిపి 7,119 మంది ఉన్నారు. సాయంత్రానికి అందుబాటులో ఉన్న వారందరికీ అందజేశారు. మిగిలిన వారికి బుధవారం పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు.

కె.కోటపాడు, దేవరాపల్లి: కె.కోటపాడులో మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి, ఎంపీడీఓ సాంబశివరావు, తెదేపా, జనసేన, భాజపా నాయకులు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. దేవరాపల్లి మండలంలో పింఛన్ల పంపిణీని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తనిఖీ చేశారు. మారేపల్లిలో ఉదయం 9 గంటల వరకు పంపిణీ ప్రారంభం కాలేదని తెలియడంతో వెంటనే అక్కడకు చేరుకున్నారు. వీఆర్‌ఓ జ్వరంతో విధులకు హాజరుకాలేదని తెలిసి వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. దేవరాపల్లి మండలంలో 96 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సువర్ణరాజు చెప్పారు.

చీడికాడ: మండలంలో 8,651 పింఛన్లకు మంగళవారం 98 శాతం పంపిణీ చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ కామేశ్వరరావు చెప్పారు. తురువోలులో తెదేపా జిల్లా అధికార ప్రతినిధి సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, చీడికాడలో తెదేపా నాయకులు ముసలినాయుడు, ఖండివరంలో సర్పంచి లక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కళావతి సిబ్బందితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.


చీడికాడలో పింఛన్లు అందజేస్తున్న తెదేపా నాయకులు

## శాకాహారమే మేలు

చోడవరం, న్యూస్‌టుడే: ఆరోగ్యానికి శాకాహార భోజనమే మేలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకులు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం శాకాహార దినోత్సవం జరిగింది. భోజన అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రత్నభారతి, లక్ష్మీమంగమ్మ, నారాయణమూర్తి, సుధీర్ పాల్గొన్నారు.

## విద్యార్థుల రాకకు పడిగాపులు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: దేవరాపల్లి మండలం తెనుగుపూడిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం నుంచి పిల్లలను దసరా సెలవులకు తీసుకెళ్లడానికి వచ్చిన తల్లిదండ్రులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు పడాల్సి వచ్చింది. యాజమాన్యం తీరుపై సహనం కోల్పోయిన కొందరు తల్లిదండ్రులు ప్రిన్సిపల్‌తో వాగ్వాదానికి దిగారు. తర్వాత వారిని లోపలకు అనుతించగా.. అప్పటికే కొంతమంది తల్లిదండ్రులు తిరిగి వెళ్లిపోయారు. మిగతా వారికి ప్రిన్సిపల్ జయప్రకాష్ సర్దిచెప్పడంతో శాంతించారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుధారాణి తెలిపారు. మంగళవారం ఆమె ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల మూడున కలశస్థాపనతో మొదలయ్యే ఉత్సవాల్లో రోజూ ఉదయం, సాయంత్రం లక్ష కుంకుమార్చన, మధ్యాహ్నం అన్నప్రసాద్ వితరణ ఏర్పాటు చేశామని వివరించారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలను తెదేపా కౌన్సిలర్ చింతకాయల రాజేష్ అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యనిర్వహణాధికారి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


ఆలయ ఆవరణలో నాయకులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి

చీడికాడ, న్యూస్‌టుడే: అప్పలరాజుపురం మెట్టపై లలితాదేవి ఆలయాన్ని దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల 3 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు చెప్పారు. మెట్ట నుంచి ఊరి వరకు రహదారి పొడవునా విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు.

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మాడుగులలో దేవీ నవరాత్రులు ఈ నెల 3 నుంచి 12 వరకు జరగనున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మంగళవారం ఆవిష్కరించారు. మోదమాంబ ఆలయ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, శ్రీదేవి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు శ్రీనాథు శ్రీనివాసరావు, మాజీ సర్పంచి దంగేటి సూర్యారావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొండలరావు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులు పసిపిల్లలతో సమానం

చోడవరం, రోలుగుంట, న్యూస్‌టుడే: ఏ స్థాయిలో ఉన్నా ప్రతి ఒక్కరూ పెద్దలను గౌరవించాల్సిందేనని స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ పేర్కొన్నారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రేమసమాజంలో మంగళవారం న్యాయ విజ్ఞాన వేదిక నిర్వహించారు. న్యాయ సహాయం కావాలంటే కోర్టును సంప్రదించవచ్చని వృద్ధులకు సూచించారు. వృద్ధులు పసిపిల్లలతో సమానమని, వారిపై ప్రేమాభిమానాలు చూపాలని రోలుగుంట ఎంపీపీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొవ్వూరులోని వెంకటేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో పలువురు వృద్ధులను సత్కరించారు. సర్పంచి కాంతమ్మ, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నాతవరం, గొలుగొండ, న్యూస్‌టుడే: వృద్ధులను ఆదరిస్తే వారి ఆయుష్షు మరింత వృద్ధి చెందుతుందని వృద్ధుల సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మాజీ సర్పంచి కొంద్రు అప్పారావు పేర్కొన్నారు. నాతవరం మండలం శృంగవరంలో మంగళవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన 100 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం వృద్ధులకు వస్త్రదానం చేశారు. సంఘం కార్యదర్శి వి.మహాలక్ష్మి, మాజీ సర్పంచి ఉలబాల అప్పలనాయుడు, యువత అధ్యక్షులు శ్రీనివాసు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షునిగా కన్నయ్యానాయుడును ఎన్నుకున్నారు. వృద్ధులను ఆదుకోవడం బాధ్యతగా కుటుంబ సభ్యులు గుర్తించాలని గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ కుమార్ అన్నారు. గొలుగొండలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.


శృంగవరంలో చీరలు అందిస్తున్న అప్పారావు, అప్పలనాయుడు



ప్రేమసమాజంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి సూర్యకళ

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక సెయింట్ ఆన్స్ వృద్ధాశ్రమంలో వృద్ధుల దినోత్సవం ఘనంగా జరిగింది. మాడుగుల కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి జి.స్వర్ణ ముఖ్య అతిథిగా హాజరై వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

**తెరపై ఈనాడు**
**పెందుర్తిలో..**
లక్ష్మీకాంత్ ప్లెక్స్-1 - దేవర
ప్లెక్స్-2 - సత్యం సుందరం

## ఎన్టీపీసీలో నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీలోని భూనిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని టీఎన్‌టీయూసీ నేత, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి ఐండిల కొండలరావు డిమాండ్ చేశారు. పరవాడలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్లాంటుకు భూములిచ్చిన స్థానిక నిర్వాసితులకు ఉపాధి కల్పించకపోవడం అన్యాయమన్నారు. నిర్వాసితులకు ఉద్యోగాలు ఇచ్చేలా యాజమాన్యం చర్యలు చేపట్టాలన్నారు. లేదంటే ప్లాంటు ఎదుట ఆందోళనలు చేపడతామని వెల్లడించారు.

# పెందుర్తి

న్యూస్‌టుడే, పెందుర్తి

**సమస్య:** 97వ వార్డు చినముషిడివాడ క్రాంతి నగర్ వద్ద 7ఏ/12 స్తంభానికున్న విద్యుద్దీపం వెలగడం లేదు.
– వెంకటరమణమ్మ, క్రాంతినగర్

**మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM**
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

**సమాధానం:** మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – శివరాం ప్రసాద్, ఏఈ, 97వ వార్డు

# ఉచిత గ్యాస్‌తో.. వంటింట్లో వెలుగులు



దీపావళి నుంచి మూడు సిలిండర్లు

వేపగుంట, న్యూస్‌టుడే

నిత్యావసరాలు, ఇంటి అద్దెలతో వంటింటి భారం పెరిగిపోయింది. దీంతో బడుగుబలహీనవర్గ కుటుంబాల మనుగడ కష్టతరంగా మారింది. కూలినాలి చేసుకుని కుటుంబాన్ని పోషించేందుకు నానా కష్టాలు పడుతున్నారు. ఈ తరుణంలో 'దీపావళి' పండగ నుంచి కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేయనుండడంతో ప్రతి ఇంటా ఆనందాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి నుంచే వారి కళ్లలో వెలుగులు విరజిమ్ముతున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేకున్నా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకెళ్తోంది. దీంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రతి ఇంటికి రూ.2433 ఆదా..

పెందుర్తి నియోజకవర్గం పరిధిలో సుమారు 50 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిని అన్ని కంపెనీల నుంచి ప్రజలు వినియోగించుకుంటున్నారు. ఇందులో పేద, మధ్య, అగ్ర వర్ణాలు ఉన్నాయి. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంతో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రస్తుత ధరలు బట్టి ఏడాదికి సుమారు రూ.2433 ప్రయోజనం కలగనుంది.

### ఆర్థిక భారం తగ్గనుంది



నా భర్త కూలి చేస్తూ కుటుంబాన్ని నడుపుతున్నారు. అద్దె ఇంటిలో ఉంటున్నాం. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో పిల్లల ఫీజులు, అద్దెలు ప్రతీ నెలా కష్టతరంగా మారింది. మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వనుండడంతో ఆర్థిక భారం తగ్గనుంది.
– మదిరెడ్డి లక్ష్మి, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, అప్పన్నపాలెం

### ఆ డబ్బులతో ఇంటి అద్దె చెల్లించుకుంటా..



ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నా. జీతం చాలా తక్కువ. ఆర్థిక ఇబ్బందులు, దేవస్థానం భూసమస్య కారణంగా ఇళ్లు నిర్మించుకోలేకపోయాం. పక్కనే అద్దెకు ఉంటున్నాం. ఇలాంటి సమయంలో ఉచిత గ్యాస్ సిలిండర్‌తో ఏడాదికి మిగిలే డబ్బులతో ఇంటి అద్దె చెల్లించుకుంటాను.
– పి.ఆశ, ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయురాలు

### పింఛనుతో జీవిస్తున్న మాకు ఎంతో ఉపయోగకరం



నేను ప్రభుత్వమిస్తున్న రూ.4 వేలు వితంతు పింఛనుతో జీవిస్తున్నాను. ఇలాంటి సమయంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం రావడం తనలాంటి వారికి ఎంతో ప్రయోజనకరం. ఆ మొత్తాన్ని వేరే ఖర్చులకు ఉపయోగపడతాయి.
– మంత్రి మాధవి, ప్రహ్లాదపురం

## ఆరోగ్యకర సాగు విధానాన్ని ప్రోత్సహించాలి



పంట నమోదు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్

సబ్బవరం, న్యూస్‌టుడే: నాణ్యమైన, ఆరోగ్యకర పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. మంగళవారం సబ్బవరం మండలం తవ్వవానిపాలెం ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గ్రామంలోని నిర్దేశిత నంబరులోని వరి పంటను పరిశీలించారు. రైతు డెక్క సన్నిబాబుతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నమోదు చేసిన పంట రైతుభూమి ఒకటేనని నిర్ధారించుకున్నారు. అదేవిధంగా రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్న ఎరువులు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ పరిశీలించారు. అనంతరం మండలంలోని సబ్బవరం శివారు చిన్నయ్యపాలెంలో కూరగాయలు పండించే రైతుతో మాట్లాడారు. వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు, అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు, సబ్బవరం మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, ఏఈవో బాలరాజు, వీఏఏ లావణ్య, తవ్వవానిపాలెం సర్పంచి బోకం సోమునాయుడు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వోలు, టెక్నికల్ ఏవో విఠల్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఉత్సవకమిటీ ప్రతినిధులు

పరవాడ, న్యూస్‌టుడే: మేజరుపంచాయతీ పరవాడలోని బొంకుల దిబ్బయూత్ ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి 12 వరకు దుర్గాదేవి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను మంగళవారం ఎంపీటీసీ సభ్యులు పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచి చుక్క రామునాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కలిసి ఆవిష్కరించారు. 3న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, వేంకటేశ్వరస్వామి పాట, 4న బుర్రకథ, 5న లక్ష దీపారాధన, 6న ఆటల పోటీలు, 7న ఉట్టికొట్టుట, 8న ముగ్గుల పోటీలు, 9న సరస్వతిదేవిపూజ, 10న భారీ అన్నసమారాధన, 11న అమ్మవారి సారె ఊరేగింపు, 12న అనుపోత్సవం ఉంటుందన్నారు.

## దసరా సెలవులు.. వాహనాల రద్దీ

పెందుర్తి, న్యూస్‌టుడే: దసరా సెలవుల నేపథ్యంలో విశాఖ - అరకు రహదారిలో వాహనాల రద్దీ బాగా పెరిగింది. బుధవారం నుంచి పాఠశాలలకు సెలవులు కావడంతో సొంతూర్లకు, అరకు పర్యాటకానికి వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుంచి పెందుర్తి బీఆర్టీఎస్ రహదారిలో వాహనాల రద్దీ నెలకొంది. పెందుర్తి కూడలిలో పలు మార్లు ట్రాఫిక్ నిలిచిపోయింది. సెలవులు ముగిసే వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు రద్దీ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.



పెందుర్తి కూడలిలో బారులుతీరిన వాహనాలు

## ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన

రాంపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలని పెందుర్తి మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ సూచించారు. రాంపురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. రబీలో అవసరమైన విత్తనాలపై చర్చించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను వివరించి అవగాహన కల్పించారు. రైతులు మాట్లాడుతూ ఆయిల్ ఇంజిన్లు, టార్పాలిన్లు, స్ప్రేయర్లు కావాలని కోరారు. ఆకుముడత, సుడిదోమ తెగుళ్ల నివారణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.

## 7న సబ్బవరం మండల సర్వసభ్య సమావేశం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 7న ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. సంబంధిత నేతలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

## పాఠశాలకు సామగ్రి వితరణ

రాంపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: భారతీయ స్టేట్‌బ్యాంకు రాంపురం శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.5 లక్షల సీఎస్ఆర్ నిధులతో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు వివిధ రకాల సామగ్రి వితరణ చేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు, అధికారులు సామగ్రిని ప్రధానోపాధ్యాయుడు జయప్రసాద్‌కు అందజేశారు. ఇందులో భాగంగా ఆర్వో ప్లాంటు, డెస్క్‌టాప్‌లు, టేబుళ్లు, గోద్రెజ్ బీరువాలు, స్టాఫ్ టేబుళ్లు, విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ బెంచీలు, ప్రింటర్, కంప్యూటర్ వీల్ ఛైర్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు.





సమకూర్చిన సామగ్రితో స్టేట్‌బ్యాంకు అధికారులు

# పెందుర్తిలో 97 శాతం పింఛన్ల పంపిణీ



గొల్లనారాయణపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, జడ్పీ హేమవతి

పెందుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం పెందుర్తి మండలంలో మంగళవారం విజయవంతంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన కార్యక్రమంలో 97.25 శాతం లబ్ధిదారులకు పంపిణీ పూర్తి చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు తెలిపారు. మండలంలోని తొమ్మిది సచివాలయాల పరిధిలో 4,097 మంది లబ్ధిదారులకు రూ.1,71,30,500 నగదు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వేపగుంట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం 93వ వార్డు గొల్లనారాయణపురంలో జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 100 రోజుల పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ హేమవతి, ఏపీడీ శ్రీరాం, మాజీ కార్పొరేటరు రాపర్తి శైలజ, జిల్లా మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: ఆసుపత్రిలో ఉన్న రోగులు మినహా పింఛన్ల పంపిణీ తొలి రోజునే వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. సబ్బవరం మండలంలోని అమృతపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. పింఛను మొత్తం అందుతుందా లేదానని పింఛనుదారులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్‌డీ ఓ.మహేశ్ సబ్బవరం గోపాలన్‌నగర్‌లోని లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో తెదేపా నేతలు కె.శ్రీను, బర్ల రమణ, గ్రామ కార్యదర్శి కె.మూర్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మపాలెంలో..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం వేగవంతంగా సాగింది. ఉదయం 5 గంటలకే సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి వృద్ధులకు, ఒంటరిమహిళలకు, కల్లుగీత కార్మికులకు, దివ్యాంగులకు తదితరులకు పింఛను సొమ్మును అందజేశారు. ముత్యాలమ్మపాలెంలో సర్పంచి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షురాలు చింతకాయల సుజాత చేతులమీదుగా పంపిణీ చేశారు. పరవాడలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పరవాడ మండల వ్యాప్తంగా 6567 మంది పింఛనుదారులు ఉండగా తొలిరోజు 6433 మందికి పింఛన్లు అందించామని ఎంపీడీవో తెలిపారు. మిగిలిన వారికి బుధవారం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.



సబ్బవరం గోపాల్‌నగర్‌లో ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్‌డీ ఓ.మహేష్ తదితరులు



రాంపురంలో పింఛను అందిస్తున్న ఎంపీడీవో కొల్లి వెంకటరావు, అధికారులు

## డ్రోన్లతో దోమలపై దండయాత్ర

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం దోమల నివారణ చర్యలకు విస్తృత చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా భారీ నీటి నిల్వలున్న ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో దోమల నివారణ రసాయాలు వెదజల్లే కార్యక్రమాన్ని జీవీఎంసీ జోన్-8 పరిధిలో చేపట్టారు. మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ బీడీనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం 97, 95 వార్డుల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 97వ వార్డు పరిధిలోని కార్మికనగర్ చెరువులో కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు డ్రోన్ పిచికారీని ప్రారంభించారు. అలాగే 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పురుషోత్తపురం వెంకప్ప చెరువు, జ్యోతినగర్ చెరువు, లక్ష్మీపురం రాముడు చెరువుల్లో డ్రోన్‌తో ఎంఎల్ ఆయిల్ వెదజల్లే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



డ్రోన్ సాయంతో దోమల నివారణ చర్యలు ప్రారంభిస్తున్న 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత, తదితరులు

## కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు



సుజాతనగర్‌లో కొలువైన కనకదుర్గమ్మ వారు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌లో కొలువైన కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయని ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 5.30 గంటలకు అమ్మవారికి అభిషేకం, గణపతి పూజ, కలశ స్థాపనతో ఉత్సవాలకు శ్రీకారం చుడతామన్నారు. 12వ తేదీ వరకు జగన్మాత రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. రోజూ జరిగే సహస్ర కుంకుమార్చన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## హనుమంతుడి సన్నిధిలో భజన

పురుషోత్తపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పురుషోత్తపురంలో జనసేన నాయకులు భజన కార్యక్రమం చేపట్టారు. ఆ పార్టీ ప్రచార కమిటీ సభ్యుడు ఉరిటి లక్కీగోవింద్ ఆధ్వర్యంలో మంగళవారం జన సైనికులు, వీర మహిళలు ఆంజనేయ స్వామి ఆలయంలో నారాయణ నామజపం, భజనలు చేశారు. తొలుత హనుమంతుడికి విశేష పూజలు నిర్వహించారు.

## ఘనంగా దసరా వేడుకలు

పెందుర్తి, న్యూస్‌టుడే: దసరా సెలవుల నేపథ్యంలో మంగళవారం పలు పాఠశాలల్లో ముందస్తు దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. సుజాతనగర్ దరి ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ఎన్.రమాదేవి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. బాలబాలికలు ఆటపాటలతో సందడి చేశారు. బాలికలు నవదుర్గల రూపంలో అలంకరించుకుని నృత్యరూపకం ప్రదర్శించారు. ★ పెందుర్తి శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రిన్సిపల్ తారకేశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులు నవదుర్గలుగా అలంకరించుకుని అమ్మవారికి పూజలు చేశారు. చిన్నారులు జానపద గీతాలకు నృత్యాలు చేసి అలరించారు. పాఠశాలల రీజనల్ ఇన్‌ఛార్జి మహమ్మద్ అలీ ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలు ప్రారంభించారు.



సుజాతనగర్ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో నవదుర్గల అలంకరణలో విద్యార్థినులు



పెందుర్తి శ్రీచైతన్య పాఠశాలలో..

## రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దృశ్యం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలి నగర్ జీవనరేఖ ఆసుపత్రిలో మంగళవారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్లాంట్ వోఅండ్ఎం విభాగ జీఎం ఎస్.జె. డేవిడ్ ప్రారంభించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని.. ఇందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 35 మంది రక్తదానం చేశారు. గాజువాకకు చెందిన వందేభారత్ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ విజయ, ఎన్టీపీసీ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ తహసీల్దారుగా ఎస్.వి.అంబేడ్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నక్కపల్లి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ డీటీ ఆర్.ఐలు, సర్వేయర్, వీఆర్వోలు తదితర రెవెన్యూ సిబ్బంది ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



పరవాడ తహసీల్దార్ అంబేడ్కర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

## సింహాద్రి ఎన్టీపీసీ కార్మికుడి మృతి



పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. సీ.ఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడ మండలం కలపాక పంచాయతీ పరిధి మూలస్వయంభూవరం గ్రామానికి చెందిన **పడాల నాగేశ్వరరావు** (55) కొంతకాలంగా ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నారు. ఉదయం 9 గంటలకు జనరల్ షిఫ్టు విధులకు హాజరయ్యారు. ప్లాంటులోని సీహెచ్‌పీ-1 వద్ద హౌస్ కీపింగ్ (బొగ్గు) పనులు చేస్తుండగా 11.30 గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి కార్మికులు ఎన్టీపీసీ దీపాంజలినగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆసుపత్రిలో భద్రపరిచారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడు కుమారుడు లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీ.ఐ తెలిపారు. ★ ఎన్టీపీసీ కార్మికుడు నాగేశ్వరరావు మృతిపై సమగ్ర విచారణ చేయించి.. మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని తోటి కార్మికులు ప్లాంటు వద్ద నిరసన తెలిపారు.

## అభినందన సభ

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: బెహరా కళాశాలలో ఇటీవల అమెజాన్ కంపెనీ జరిపిన ప్రాంగణ ఎంపికల్లో ఉపాధి పొందిన విద్యార్థులకు మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బెహరా కళాశాలల ఎండీ బెహరా విజయచైతన్య, అధ్యాపకులు కామేశ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.





ప్రాంగణ ఎంపికల్లో ఉపాధి పొందిన విద్యార్థులు



పెందుర్తి కూడలిలో కురుస్తున్న వర్షం

## ఉదయం భానుడు.. మధ్యాహ్నం వరుణుడు

పెందుర్తి, న్యూస్‌టుడే: ఉదయమంతా భానుడి ప్రతాపంతో పెందుర్తి పరిసర ప్రాంత ప్రజలు మంగళవారం తీవ్ర ఉక్కపోతకు గురయ్యారు. మధ్యాహ్నం 2 గంటలు దాటాక ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులతో సుమారు గంట పాటు కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. పలు కాలనీల్లో గుంతల దారుల్లో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

## సత్తా చాటిన విద్యార్థులు

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు వి.జుత్తాడ పాఠశాలలో జరిగిన పెందుర్తి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటారు. కబడ్డీ, ఖోఖో, చదరంగం, యోగా పోటీల్లో రాణించి ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విజేతలను ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు అభినందించారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది



విద్యార్థులతో ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పి.భోనంగి సంస్కృతి గ్లోబల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 3, 4 తేదీల్లో ఏలూరు జిల్లా పెదవేగిలో జరగనున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఎ.వి.శశాంక్‌వర్మ, పి.మహేశ్, బి.రోహిత్ రాజు, కె.ధీరజ్‌శ్రీరామ్ గతనెలలో విశాఖ కృష్ణాపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించినట్లు స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపల్ సీతాలక్ష్మి అభినందించారు. సీఈవో నిశాంత్, కోచ్ రాజేశ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా స్థాయిలో రాణింపు

సబ్బవరం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి అండర్-19 క్రీడా పోటీల్లో సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ కె.రమణారావు ఆధ్వర్యంలో పాల్గొన్న విద్యార్థుల్లో ముగ్గురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పీవీఎన్ మూర్తి తెలిపారు. వాలీబాల్ పోటీల్లో పి.ప్రశాంతి (ఎంపీసీ ద్వితీయ సంవత్సరం), ఎ.ఆనంద్ (సీఈసీ ప్రథమ సంవత్సరం).. కబడ్డీలో డి.మాతాజీ (ఈటీ ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం) ఉన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌తో పాటు జిల్లా వృత్తి విద్యా పర్యవేక్షక అధికారి పి.మురళీధర్ తదితరులు వారిని అభినందించారు.



పి.ప్రశాంతి



ఎ.ఆనంద్



డి.మాతాజీ

## ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం పరవాడ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సీ.ఐ ఆర్.మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. హెల్మెట్ ధరించాలని, మితిమీరిన వేగం పనికిరాదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నారాయణరావు, అధ్యాపక సిబ్బంది శ్రీధర్, లక్ష్మి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీ.ఐ మల్లికార్జునరావు